Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.6

April 2023



## ప్రేక్షకులమా? ప్రయాసపడేవారమా?

ఎడిటోరియల్

# ఏ కేటగిరి?

సండేస్కూల్ టీచర్స్‌లో ఒకరు ఆ ఆదివారం సండేస్కూల్‌కి రాలేదు. సమస్య ఏంటో తెలుసుకొందామని డియల్ మూడీ ఆయన ఇంటికి వెళ్ళాడు. ఆ సండేస్కూల్ టీచర్ తనకు ఆరోగ్యం సరిగా లేదని ఊపిరితిత్తుల్లో రక్తస్రావం అవుతుందని, తనింక ఎక్కువ రోజులు బతకనని డాక్టర్ చెప్పాడు. అందుకనే మిచిగాన్ సరస్సు నుంచి తన స్వస్థలమైన న్యూయార్క్ రాష్ట్రానికి తిరిగి వెళ్తున్నాని సండేస్కూల్ టీచర్ చెబుతాడు. తన స్వస్థలంలో విధవరాలై, చనిపోవడానికి సిద్ధంగా ఉన్న తన తల్లి ఉంటుంది. ఆయనింకా మాట్లాడుతూ, నా బాధంతా నా ఆరోగ్యం గూర్చి కాదు గానీ నా సండేస్కూల్‌లోని పిల్లలనెవ్వరినీ క్రీస్తువద్దకు నడిపించలేదనేదే అని డియల్ మూడీతో చెబుతాడు. ఈ మాటలు మూడీని ఆలోచింపజేసి "మీరు వచ్చి వారికి సువార్త చెబుతానంటే నేను కూడా మీతో వస్తానని" మూడీ చెబుతాడు.

తనకు ఎంతో శారీరక బలహీనత ఉన్నప్పటికీ మొదట ఒక అమ్మాయి ఇంటికి వెళ్ళి సువార్త చెప్పి యేసు క్రీస్తును అంగీకరించమని కన్నీటితో బతిమాలడతాడు ఆ సండేస్కూల్ టీచర్. సువార్త విన్న ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. ఆయన సువార్త చెప్పిన తర్వాత మూడీని ప్రార్థించమంటాడు. ఒక యువతిని మార్చమని దేవునిని ప్రార్థించే పని తన జీవితంలో మూడీ ఎప్పుడూ చేయలేదు. దేవుడు వారి ప్రార్థనకు జవాబిచ్చాడు. ఊపిరిని కష్టంగా పీల్చు కొంటూ పదిరోజులు ఈ విధంగా గడిచిన తర్వాత చివరి విద్యార్థి కూడా యేసుక్రీస్తును అంగీకరించడం వీరిద్దరూ గమనిస్తారు. ఇప్పుడు క్లాస్‌లోని మొత్తం విద్యార్థులు దేవునిని అంగీకరించారు. మరుసటిరోజు సంతోషంతో తన స్వస్థలానికి వెళ్తున్న సండేస్కూల్ టీచర్‌కి వీడ్కోలు చెప్పడానికి అందరూ కలిసి రైల్వేస్టేషన్‌కి వెళతారు.

'తన జీవితంలో నశించిపోయే ఆత్మల పట్ల ఆరిపోని అగ్నిరాజేసిన ఒక గొప్ప సంఘటన'గా ఈ అనుభవాన్ని గురించి మూడీ చెబుతాడు. ఇది 1860వ సంవత్సరంలో జరిగింది. అప్పటి నుంచి దూకుడుగా వ్యక్తిగత సువార్తను చేస్తుండేవాడు, ప్రపంచంలో గొప్ప సువార్తికునిగా జీవించాడు.

నశించిపోయే ఆత్మల రక్షణ కొరకు సండేస్కూల్ టీచర్‌లా తపించి, ప్రయాసపడే విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మన పరిచర్యలో కొద్దిమంది మాత్రమే ఉన్నారు. చాలామంది పరిచర్యలో ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ప్రేక్షకులు ఏం చేస్తారు? నచ్చితే పొగడుతారు, నచ్చకపోతే విమర్శిస్తారు. అలాచేసుంటే బాగుండేది, ఇలా చేస్తే మంచిదని ఉచిత సలహాలు ఇస్తుంటారు. తమకు కుదిరినప్పుడు, సమస్యలేమీ లేనప్పుడు పరిచర్య గూర్చి ఆలోచిస్తారు. విద్యార్థి పొలంలోకి దిగి పనిచేయడానికి, కష్టపడడానికి, నష్టపోవడానికి వారికి బోలెడన్ని ఆటంకాలు ఉంటాయి. అందుకనే ప్రణాళికలు వేసినంతగా గొప్పగా పరిచర్య విస్తరణ జరగడంలేదు. విద్యార్థులకు, యంగ్ గ్రాడ్యుయేట్స్‌కు మాదిరిగా ఉండేవారు, మౌళిక విలువలు కలిగి జీవించేవారు కరువయ్యారు.

యుఇయఫ్ఐలోని మన పితరులు తమ జీవితాన్ని సువార్త కేంద్రీకృతంగా మలచుకొన్నారు. నశించిపోయే ఆత్మల రక్షణ కొరకు అంగలార్చారు, వారి గృహాలు తెరిచారు, ఖర్చుపెట్టారు, సుఖాలు వదులుకొన్నారు, బరువులు మోసారు, బంధాలు పెంచుకొన్నారు, అనుబంధాలు త్రుంచుకొన్నారు, అవమానాన్ని భరించారు, పవిత్రంగా జీవించారు, పరుగెత్తారు, ప్రయాణాలు చేశారు, కొవ్వొత్తిలా కరిగిపోయి దావీదు వలె తమ తరానికి గొప్ప సేవ చేసి నిద్రించారు.

యెరూషలేము గోడలు కూల్చబడి, గుమ్మాలు కాల్చబడినప్పుడు నెహెమ్యా కన్నీటితో ప్రార్థించాడు, ప్రణాళిక కలిగి, ఇశ్రాయేలీయులను దేవుని పనికై పురికొల్పి, 52 రోజుల్లో గోడ పనిని ప్రయాసతో పూర్తిచేసి, ప్రజలను పరిశుద్ధత వైపుకు మళ్ళించాడు. దేవుని పనికోసం తన జీవితాన్ని సంపూర్ణంగా సమర్పించుకొని వ్యయమైపోయాడు.

క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంఘాన్ని స్థాపిస్తే, దాని విస్తరణ కోసం పౌలు బహుగా ప్రయాసపడి తన జీవితాన్ని సంపూర్ణంగా దేవునికి అప్పగించాడు. నశించిపోయే ఆత్మల రక్షణకోసం ప్రాంతాల్ని దర్శించాడు, ప్రకటించాడు, ప్రార్థించాడు, హెచ్చరించాడు, అవమానాల్ని భరించాడు (అపొ. 13:42;14:22). సువార్త పనికొరకు తిమోతి, తీతు, సీల, లూకా, ఒనేసీము లాంటి వ్యక్తుల్ని తర్ఫీదు చేశాడు. మంచి పోరాటము పోరాడి తన పరుగును కడముట్టించాడు.

కొంతమంది తమ జీవితాల్ని **వేస్ట్** చేసుకొంటారు,
కొంతమంది తమ జీవితాన్ని **ఎంజాయ్** చేస్తారు,
మరి కొంతమంది తమ కుటుంబం కోసమే తమ సమయాన్నంతటిని **స్పెండ్** చేస్తారు.
కేవలం కొద్దిమంది మాత్రమే ప్రభువు మనసు కలిగి అనేకులను దేవునివైపుకు తిప్పుతూ, దేవుని పరిచర్యలో **క్యాండిల్‌లా బర్న్** అవుతారు.
మనం ఏ కేటగిరీలో ఉన్నాము?

**– పి. సునీల్ జాకబ్**

విద్యార్థి జ్వాల

Vol. 29, No.6 March 2023
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508

ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

May: Mission Partnership
June: Building Christlike leadership

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# అత్యవసరం


నేటి మానవాళి అత్యవసర అక్కర సువార్త మాత్రమే. ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూస్తే విశ్వవిద్యాలయాలు, అందలి బోధనాంశాలు, రాజ్యాంగాలు, సామాజిక ఉద్యమాలు, ఏవీ మానవులు ఆత్మహత్యలు చేసుకోకుండా, అవినీతికి, హింసకు పాల్పడకుండా ఆపలేక పోతున్నాయి. దేశాల మధ్య సఖ్యత కుదరక జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలలో చనిపోయిన వారికంటె, ఆ తర్వాత జరిగిన, జరుగుచున్న యుద్ధాలలో ఎక్కువమంది చనిపోతున్నారనేది అక్షర సత్యం. ఇట్టి దారుణ పరిస్థితుల నుంచి మానవాళిని రక్షించి, మంచిగా మార్చగలిగేది సువార్తే. సువార్త ఎక్కడ ప్రకటింపబడిందో, ఏ ప్రజలైతే సువార్తను స్వీకరించారో, ఆయా సమాజాలు మార్చబడ్డాయి. దైవిక విలువలు కలిగి మానవ అభ్యున్నతికి పాటు పడుతున్నాయి.

సువార్తను ప్రకటించే వారు లేకుండా ప్రజలు ఎలా వింటారు, విశ్వసిస్తారు, ప్రార్థిస్తారు, రక్షణపొందుతారు అని ప్రశ్నిస్తూ, సువార్త ప్రకటించే వారి పాదములు ఎంతో సుందరములు అని కితాబిచ్చాడు పౌలు (రోమా 10:14). దీనినిబట్టి తోటివారికి సువార్త ప్రకటించడం ప్రతి విశ్వాసి ప్రాథమిక బాధ్యత అని అర్థమవుతుంది. నీవు / నేను ఎంతమందికి సువార్త ప్రకటించామన్నది మాత్రమే పరలోకంలో లెక్కించబడేది, ప్రభువు మెచ్చుకొనేది కూడా.

## లోపలి పేజీల్లో...

- ఏ కేటగిరి - 2
- పరిచర్యలో పౌలు ప్రయాస - 4
- మన నినాదం - 9
- ప్రతిభావంతులకు ప్రభువును పరిచయం చేద్దాం - 12
- పరిచర్యలో సమస్యలు - 16
- ఔట్‌గోయింగ్ విద్యార్థులు ప్రభువులో, పరిచర్యలో కొనసాగాలి - 18
- యేసు నీకెలా అర్థమయ్యాడు? - 20
- మీరెన్నాళ్ళు తడవు చేస్తారు? - 22
- ఫలించే సువార్త - 26
- హైకూలు - 28
- వ్యక్తిగతంగా ఆత్మల్ని గెలుచుకోవడం - 29
- కోశాధికారి లేఖ - 31
- పనిచేస్తావా పాడుబడి పోతావా? - 32

కవర్ కథనం



# ప్రభువు పరిచర్యలో పౌలు ప్రయాస

పరిచయం అక్కరలేని పదం పరిచర్య. పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయి పరిచర్యలు. పెద్ద పెద్ద భవనాలు కట్టడమే పరిచర్య అని అంటారు కొందరు. మోటివేషనల్ ప్రసంగాలు చేస్తూ మేము క్రైస్తవ పరిచర్య చేసున్నామనేవారు కొందరు. ఇవ్వండి, పొందండని చెప్పి ఇదే గొప్ప పరిచర్య అని ప్రజలను భ్రమపరచే వారు మరికొందరు. డిజిటల్, ఆన్‌లైన్, మెగా చర్చ్ పరిచర్య ఇలా...ఎన్నో. కొంతమందికి ప్రజలను సంతోషపెట్టడం, సంఖ్యను, ధనాన్ని, పరపతిని పెంచుకోవడమే పరిచర్య. పరిచర్య అంటే నిజంగా ఇదేనా? క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు నిజమైన, లేఖనాధారమైన పరిచర్యను గూర్చిన పెద్ద సందిగ్ధం ఉంది. మనం కూడా విద్యార్థుల మధ్య పరిచర్య చేస్తున్నాము. పరిచర్యను గూర్చి సరైన అవగాహన కలిగి ఉండడం ఎంతైనా అవసరం.

నూతన నిబంధనలో యేసుక్రీస్తు తర్వాత గొప్ప ప్రభావాన్ని చూపిన వ్యక్తి అపొస్తలుడైన పౌలు. మొదటి శతాబ్ధంలో ఉన్న మూడుఖండాలకు దేవుని సువార్తను తీసుకొని వెళ్ళాడు. నూతన నిబంధనలో ఎక్కువ పుస్తకాలను రాసి, అందరికంటే ఎక్కువగా శ్రమలు అనుభవించాడు. అతని యొక్క రచనలు క్రైస్తవ వేదాంతంపై గొప్ప ప్రభావాన్ని చూపాయి. దాదాపు నాలుగు మిషనరీ యాత్రలు చేసి, అనేక సంఘాలను కట్టాడు.

పౌలు తన దృష్టిలో పరిచర్య అంటే ఏంటో, పరిచర్యను ఏ కోణంలో చూశాడనే విషయం అపొస్తలుల కార్యములు 20వ అధ్యాయంలో వివరించాడు. పౌలు ఓడలో యెరూషలేముకు వెళ్తుతున్నప్పుడు ఓడ మిలేతులో చాలా రోజులు ఆగిపోయింది. అప్పుడు మిలేతు నుంచి 30 మైళ్ళ దూరములో ఉన్న ఎఫెసీ సంఘ పెద్దలను తన దగ్గరకు పిలిపించి వారితో మాట్లాడతాడు. 19వ వచనం నుంచి పౌలు ప్రసంగిస్తూ తన పరిచర్యను నాలుగు దృక్పథాలతో చూశానని చెప్పాడు.

1. **దేవుని యెడల:** క్రీస్తుకు సేవ చేసినట్టుగా పరిచర్యను చూశాడు
2. **విశ్వాసులు లేదా సంఘము యెడల:** భోధించ డంగా పరిచర్యను చూశాడు
3. **నశించి పోతున్న వారి యెడల:** సౌవార్తీకరణగా పరిచర్యను చూశాడు
4. **తన యెడల:** త్యాగము లేదా సమర్పణగా పరిచర్యను చూశాడు.

మన శ్రమను, పరిచర్యను వ్యక్తులు గుర్తించినా, గుర్తించక పోయినా, అభినందించినా, అభినందించకపోయినా మనము బాధపడము. ఎందుకంటే మనం సేవ చేసేది వ్యక్తుల కోసం కాదు క్రీస్తు కోసమే. పరిచర్యను ఇలాంటి దృక్పథంతో చూస్తే ఇతరులు గుర్తించకపోయినా బాధపడము, గాయపడము, అభినందించకపోతే ఆగిపోము, విమర్శిస్తే విచారపడి, వెనక్కిపోము.

## 1. దేవుని యెడల: క్రీస్తుకు సేవచేయడం

19వ వచనంలో 'ప్రభువును సేవించుచుంటిని' అని అంటాడు. పౌలు ఎల్లప్పుడూ పరిచర్యను ప్రాథమికంగా క్రీస్తును, దేవునిని సేవించడంగా చూశాడు. 'సేవించడం' అనే పదానికి అర్థం బానిసత్వం. గ్రీకు భాషలో కట్టు బానిస అని భావం. పౌలు తనను తాను క్రీస్తుకు బానిసగా చూసుకొంటున్నాడు. దాసుడు లేక బానిస తన యజమాని సంతోషం కోసం జీవిస్తాడు, పనిచేస్తాడు. పౌలు సువార్త ప్రకటించినా, వాక్యాన్ని బోధించినా, మిషనరీ యాత్రలు చేసినా దానిని ప్రభువుకు చేసే సేవగా చూశాడు. ప్రభువును సంతోషపెట్టడంగా చూశాడు. అది ప్రభువుకు చేసే సేవ కాబట్టి ఇతరుల మెప్పును పౌలు కోరుకోలేదు. ఆ దృక్పథంతో పౌలు పరిచర్యను చూశాడు, చేశాడు.

పౌలు ఇతరులను బలపరచినా, సంఘాలను ప్రారంభించినా అది ఆ వ్యక్తులకు చేసే సేవగా కాకుండా క్రీస్తుకు చేసే సేవగా చూశాడు. అందుకే గలతీ పత్రికలో నేను మనుష్యులను సంతోషపెట్టగోరుచున్నానా? నేనిప్పటికిని మనుష్యులను సంతోషపెట్టు వాడనైతే క్రీస్తు దాసుడను కాకయేపోవుదును (గలతీ 1:10).

మనము కూడా యుఇయస్ఐ సంస్థ కోసం పరిచర్య చేయడంలేదు. యుఇయస్ఐకి మనము దాసులము కాదు. ఒకవేళ నువ్వు ఇయు లేదా ఇజియఫ్ కమిటీ సభ్యుడవు అయితే నువ్వు ఆ కమిటీకి సేవ చేయడం లేదు. కమిటీని సంతోషపెట్టడానికి నువ్వు లేవు. నువ్వు అలా భావిస్తే పరిచర్య మీద తప్పుడు అవగాహన కలిగియున్నావని అర్థం. అన్నవాళ్ళు లెక్క అడుగుతారని, రిపోర్ట్ పంపించాలి కాబట్టి పరిచర్య చేయకూడదు. మనము ఒకవేళ విద్యార్థులకు బైబిల్ స్టడీ తీసుకొంటే అది నువ్వు క్రీస్తుకు చేస్తున్న పరిచర్యగా చూడాలి. మనం సేవిస్తున్నది వ్యవస్థను కాదు, వ్యక్తులను కాదు, కమిటీని కాదు, క్రీస్తుకు సేవ చేస్తున్నామనే విషయం గుర్తుండిపోవాలి.

మన శ్రమను, పరిచర్యను వ్యక్తులు గుర్తించినా, గుర్తించకపోయినా, అభినందించినా, అభినందించకపోయినా మనము బాధపడము ఎందుకంటే మనం సేవ చేసేది వ్యక్తుల కోసం కాదు క్రీస్తు కోసమే. పరిచర్యను ఇలాంటి దృక్పథంతో చూస్తే ఇతరులు గుర్తించకపోతే బాధపడము, గాయపడము, అభినందించకపోతే ఆగిపోము, విమర్శిస్తే విచారపడి వెనక్కిపోము.

2 తిమోతి 2:15లో సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుము అని రాస్తాడు. ఇది చాలా శక్తివంతమైన వాక్యము. మనము బైబిల్ స్టడీకి సిద్ధపడేటప్పుడు ఇది మనుష్యులకు నచ్చుతుందా? అనే ఆలోచన ఉండకూడదు. ఈ వాక్య భాగాన్ని నేను బోధిస్తున్నప్పుడు అక్కడ యేసుక్రీస్తు ఉండి 'నువ్వు వాక్యాన్ని సరిగా వివరించి, బోధిస్తున్నావు' అని చెప్పడం కోసం మనము తీసుకోవాలి. యంపిసి విద్యార్థులను కలుస్తున్నప్పుడు కమిటీ వారు లెక్క అడుగుతారు కాబట్టి కలవడం కాదు గానీ అది నేను ప్రభువుకు చేసే సేవ అనే దృక్పథంతో పాల్గొనాలి. ఇలాంటి దృక్పథంతో పరిచర్య చేస్తే విప్లవాత్మకమైన మార్పులను చూస్తాము.

పౌలు ఈ లేఖన భాగములో రెండు విధాలుగా ప్రభువును సేవించానని చెప్పాడు.

### 1. వినయభావముతో సేవించాడు

కొంచెము వినయంతో కాదు పూర్ణమైన వినయభావంతో సేవించానని చెప్పాడు. దాసుడిగా ఉండడం ఒక విషయమైతే దాసుని మనసు కలిగి ఉండడం ఇంకో విషయం ..పౌలు దాసుని మనసు కలిగి పూర్ణమైన వినయంతో ప్రభువును సేవించాడు. ఎక్కడా కూడా గర్వముతో, నేను చెయ్యగలను అనే భావంతో చేయలేదు గానీ వినయంతో పౌలు పరిచర్య చేశాడు. కేవలము పౌలు సేవ మాత్రమే కాదు

**సౌ**వార్తీకరణ యుఇఐయస్ఐ పరిచర్యకు హృదయం లాంటిది. అదే మన హృదయ స్పందన కావాలి. సువార్త ప్రకటనను నిర్లక్ష్యం చేసే ఏ సంఘమైనా, సంస్థ అయినా చనిపోయే ప్రమాదం ఉంది. ప్రతి విశ్వాస విద్యార్థి, గ్రాడ్యుయేట్ పౌలు లాగా సువార్త ప్రకటించకపోతే నాకు శ్రమ అని కేకలు వేయాలి.

గానీ సేవకుని మనసు కలిగి క్రీస్తు యొక్క పరిచర్య చేశాడు. అతడు సామర్థ్యము, ప్రావీణ్యము, జ్ఞానము కలిగినవాడైనా గానీ దీనమనసు కలిగి ఉన్నాడు. మనము కూడా పరిచర్యను దాసుని మనసు కలిగి చేయాలి.

### 2. కన్నీళ్లు విడుచుచు ప్రభువును సేవించాడు

పౌలు యొక్క పరిచర్య కన్నీళ్లతో కూడుకొన్న పరిచర్య. నశించిపోతున్న ఆత్మల కొరకు అతను కన్నీళ్లు విడిచాడు. విశ్వాసులు పాపములో జీవిస్తున్నప్పుడు కన్నీళ్లతో ప్రార్థించేవాడు. దేవునికి చెందాల్సిన ఆరాధన విగ్రహాలకు ఆపాదించబడుతున్నప్పుడు అతనికి నొప్పి కలిగింది. లోకములోని పాపమును చూస్తున్నప్పుడు అతను కన్నీళ్లు విడిచాడు. బాహ్యమైన శ్రమలను కూడా అనుభవించాడు, యూదుల కుట్రల వలన శోధనలు కలిగినా కూడా ప్రభువును కన్నీళ్లు విడచుచూ పూర్ణమైన వినయభావంతో సేవించాడు.

### 2. విశ్వాసులు లేదా సంఘానికి: బోధించడం

20 వ వచనంలో ప్రయోజనకరమైనది ఏదియు దాచుకొనక బహిరంగముగాను, ఇంటింటను మీకు తెలియజేస్తూ బోధించానని రాస్తున్నాడు. 27వ వచనంలో దేవుని సంకల్పమంతయు మీకు తెలుపకుండా నేనేమి దాచుకొనలేదని రాస్తాడు. పౌలు తన యొక్క పరిచర్యలో లేఖనాలను బోధించడానికి చాలా ప్రాముఖ్యతను ఇచ్చాడు.

పౌలు సువార్త చెప్పి రక్షణ పొందిన విశ్వాసులను ఆయన విడిచిపెట్టకుండా ఫాలోఅప్ చేసి విశ్వాసంలో బలపరచాడు. వారితో పాటు రోజులు, నెలలు, సంవత్సరాలు ఉండి దేవుని వాక్యము చేత వారిని పోషించాడు. థెస్సలొనీకయులకు యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చిన సిద్ధాంతాన్ని బోధించాడు. వారికి బహిరంగంగా, వ్యక్తిగతంగా కూడా దేవుని యొక్క వాక్యాన్ని బోధించాడు. పౌలు తన యొక్క అనుభవాలతో విశ్వాసులను పెంచలేదు. లేఖన సత్యాల యొక్క శక్తిని గుర్తించి శక్తిగల వాక్యమును విశ్వాసుల ఎదుగుదలకు, పవిత్రీకరణ కొరకు విశ్వాసంతో బోధించాడు. రక్షణ పొందిన విశ్వాసులను పోషించడంలో లేదా ఆహారము పెట్టడంలో విఫలమైతే మనము పరిచర్యకు అర్హులము కాదు అని ఒక దైవజనుడు అభిప్రాయపడ్డాడు (యిర్మీయా 23:1–4, యెహెజ్కేలు 34:2–10)

ఆకర్షణీయమైన బోధ ఆధ్యాత్మిక వినాశనాన్ని పెంపొందిస్తుంది. తప్పుడు సిద్ధాంతం లేదా బోధ తప్పుడు జీవితానికి దారితీస్తుంది. సరైన బోధ అనేది సరైన బతుకును కలిగిస్తుంది. మన చుట్టూ కూడా అనేకమైన తప్పుడు బోధలు ఉన్నాయి. మనము సత్యాన్ని అర్థం చేసుకోలేకపోతే సత్యాన్ని చెప్పలేము, దానిని కాపాడుకోలేము. నేడు అనేకమంది విశ్వాస విద్యార్థులు అబద్ధ బోధలవైపు కొట్టుకొని పోతున్నారు.

దేవుని ప్రజలు దేవుని గూర్చిన ఆకలితో అలమటిస్తున్నారు. సాతాను యొక్క బలమైన ఆయుధం దేవుని వాక్యమును గూర్చి మనిషికున్న అజ్ఞానమే. నా జనులు జ్ఞానము లేనివారై నశించుచున్నారు (హోషేయ 4:6).

వాక్య కేంద్రిత పరిచర్య మనది అని చెప్పుకొంటున్నాము గానీ వేదాంతపరంగా మనము చాలా బలహీనంగా ఉన్నామనే సంగతిని తప్పనిసరిగా ఒప్పుకోవలసిందే.

దేవుని యొక్క వాక్యము సిద్ధాంతాన్ని సమకూరుస్తుంది. త్రిత్వాన్ని తిరస్కరించేవారు, యేసుక్రీస్తు యొక్క దైవత్వాన్ని తిరస్కరించేవారు దేవుని వాక్య లోపారాహిత్యాన్ని, అధికారాన్ని ప్రశ్నించేవారు, పరిశుద్ధాత్మ దేవుని గూర్చిన తప్పుడు బోధలు మన కళాశాలల్లోకి చొచ్చుకొని వచ్చాయి. వీటన్నిటిని ఎదుర్కోవాలంటే మనవారిని సంసిద్ధం చేయాలి. వారికి వేదాంతాన్ని, సిద్ధాంతాలను బోధించాలి. థియాలజి అనేది మన పరిచర్య, జీవన విధానంలో ఒక భాగము కావాలి. సమకాలీన ప్రపంచంలో విశ్వాస విద్యార్థులు ఎదుర్కొనే

సమస్యలు, శోధనలకు దేవుని వాక్యపు వెలుగులో వారికి జవాబు చెప్పాలి.

### 3. నశించి పోతున్న వారికి: సౌవార్తీకరణ

21వ వచనంలో పౌలు తన యొక్క పరిచర్య కేవలము క్రైస్తవులకు మాత్రమే కాదు గానీ అవిశ్వాసులకు కూడా అని చెబుతున్నాడు. నశించిపోతున్న ప్రజల పట్ల తనకు బాధ్యత ఉందని పౌలు గుర్తిం చాడు. యూదులు, గ్రీసు దేశస్తులు మారుమనసు పొంది మన ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాస ముంచాలని సాక్ష్యమిచ్చానని పౌలు అంటున్నాడు. 1 కొరింథీ 9వ అధ్యాయంలో సువార్త ప్రకటించవలసిన భారము నా మీద మోపబడియున్నది అని, సువార్త ప్రకటించకపోతే నాకు శ్రమ అని అంటాడు. నేను సువార్త గూర్చి సిగ్గుపడను అని అంటాడు. నశించి పోతున్న ప్రజలకు తాను సువార్త విషయములో రుణస్తుడను అని పౌలు అంటున్నాడు. రోమా 9వ అధ్యాయంలో సాధ్యమైన యెడల దేహ సంబంధులైన నా సహోదరుల కోసం నేను క్రీస్తు నుండి వేరై శాపగ్రస్తుడనై యుండగోరుదునని అంటాడు. పౌలు సువార్త ప్రకటించడానికి పిలవబడ్డాను అనే సంగతిని గుర్తించాడు. సువార్త మాత్రమే నశించిపోతున్న ప్రజలను మారుస్తుందని నమ్మాడు.

ఇక్కడ సాక్ష్యమిచ్చుచూ అంటే సంపూర్ణమైన సాక్ష్యము అని అర్థము. పౌలు అన్నివేళలా సంపూర్ణమైన సువార్తను ప్రకటించాడు. పౌలు ఎప్పుడూ ప్రజలను చేరుకోవడానికి సువార్తను కల్తీ చేయలేదు. ప్రజలను సంతోష పెట్టడానికి వారికి ఆశీర్వాద సువార్తను ప్రకటించలేదు. వారి భావోద్రేకాలను రేకెత్తించడానికి వృత్తాంతాలు, కథలు చెప్పలేదు. పాపము, సిలువ, పునరుత్థానము గూర్చి అన్నివేళలా ప్రకటించాడు. పౌలు తన యొక్క జీవితాన్ని సువార్త ప్రకటన కోసం సమర్పించుకున్నాడు. తన యొక్క జీవిత ఆకాంక్ష అంతా కూడా సువార్త ప్రకటనే.

మన యొక్క ఆకాంక్షలు ఏంటి? డబ్బు సంపాదించడమా? పెళ్లి చేసుకోవడమా? మంచి ఉద్యోగం సాధించడమా ? పిల్లలను జీవితంలో బాగా స్థిరపరచడమా? మంచి ఇల్లు కట్టుకోవడమా? ఇవన్నీ మంచివే. అయితే క్రైస్తవుల ప్రధాన ఆకాంక్షను కబళించేంతగా లేదా పూర్తిగా ఉనికిలో లేకుండా అవి చేస్తున్నాయా అన్నదే ప్రశ్న.

సౌవార్తీకరణ యుఇయస్ఐ పరిచర్యకు హృదయం లాంటిది. అదే మన హృదయ స్పందన కావాలి. సువార్త ప్రకటనను నిర్లక్ష్యం చేసే ఏ సంఘమైనా సంస్థ అయినా చనిపోయే ప్రమాదం ఉంది. ప్రతి విశ్వాస విద్యార్థి, గ్రాడ్యుయేట్ సువార్త ప్రకటించకపోతే నాకు శ్రమ అని పౌలు లాగా కేకలువేయాలి.

### 4. తన యెడల: త్యాగము, సమర్పణ

పౌలు తన విషయంలో పరిచర్య అంటే స్వీయ చిత్తాన్ని సమర్పించడంగా చూశాడు. తాను జీవించడానికి ఉన్న ఏకైక కారణం సేవ చేయడమే. 22వ వచనంలో ఇదిగో నేను ఆత్మ చేత బంధింపబడిన వాడనై యెరూషలేముకు వెళ్తున్నానని అంటాడు. బంధించబడడం అంటే సంకెళ్లు వేయబడడం, తాళ్ళతో కట్టబడడం. అతను చాలా శక్తివంతమైన ప్రభావం క్రింద ఉన్నాడు. పరిచర్యను చేయాలనే ఆశ కొరకు ఆత్మలో బంధించబడ్డాడు. నాకు ఏమి సంభవించబోతుందో దాని గురించి నాకు చింతలేదు, ఎందుకంటే నేను నా ప్రాణము గురించి లెక్కచేయనని అంటున్నాడు. జీవించడానికి నాకు ఒకే ఒక కారణము ఉన్నది. అదే దేవుడు నాకు అప్పగించిన పరిచర్యను సంపూర్తి చేయడం.

> ఐదు లేదా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఔట్ రీచ్ కళాశాలకు వెళ్ళి వారానికి 30 నిమిషాలు సమయాన్ని కూడా కేటాయించలేకపోవడం, యంపిసి కోసం ఒక గంట కేటాయించలేని మనం పరిచర్య గూర్చి గొప్పగా మాట్లాడుకోవడం బాధాకరం. కాన్ఫరెన్స్‌ల కోసం మాత్రం రోజుల తరబడి సమయాన్ని కేటాయిస్తున్నాం. విద్యార్థులను కలవడానికి, సువార్తను ప్రకటించడానికి, ఔట్రీచ్ కళాశాలను ప్రభువు కోసం గెలవడానికి, చెమట కార్చడానికి మాత్రం మనకు సమయము లేదు. ఇలాంటి ధోరణి కొనసాగినంత కాలము మన రాష్ట్రాన్ని ఎప్పటికీ ప్రభువు కోసము గెలవలేము.

పౌలుకు పరిచర్య అంటే సమర్పణ లేదా త్యాగము. మనకు పరిచర్య అంటే ఖాళీ సమయంలో చేసేది. క్రైస్తవ్యం, పరిచర్య మనకు ఒక విశ్రాంతి శిబిరాలుగా తయారయ్యాయి. క్యాంపులకు, కాన్ఫరెన్స్‌లకు గుంపులు గుంపులుగా వెళ్ళి అక్కడ మంచి సేవకుల వాక్యము విని సంతోషించి, సేదదీరుతున్నాము. కేవలం సేదదీరితే పరిచర్య జరగదు. కళాశాలలకు, ఔట్రీచ్ సెంటర్స్‌కి వెళ్ళి చెమటోడ్చేవారు కావాలి. ఏసి రూమ్స్‌లో కూర్చొని వాక్యము వినడం మాత్రమే కాదు కళాశాలలకు వెళ్లి ఎండలో కూడా సువార్తను ప్రకటించేవారు కావాలి. పరిస్థితులు బాగున్నప్పుడు మాత్రమే కాదు పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు కూడా పరిచర్యలో పాల్గొనేవారు కావాలి.

ఆదిమ క్రైస్తవులు పరిచర్య కోసము కేవలం చెమట మాత్రమే కాదు రక్తాన్ని కూడా చిందించారు. ఫిలిప్పీ పత్రిక 2:30లో పౌలు ఎపఫ్రోదితు గూర్చి చెబుతూ నా యెడల మీ పరిచర్యలో ఉన్న కొదువను తీర్చుటకై అతడు తన ప్రాణమునైనా లక్ష్యపెట్టక క్రీస్తు యొక్క పని నిమిత్తము చావునకు సిద్ధపడ్డాడు. క్రీస్తు పని నిమిత్తము అతడు తన ప్రాణము గురించి కూడా ఆలోచించలేదు.

క్రీస్తు పని నిమిత్తము మనము తప్పకుండా త్యాగం, సాహసం చేయాలి . ఒక్కోసారి మన నిద్రను, గౌరవాన్ని, డబ్బును, సుఖాలను, సెలవులను, ఇంకా అవసరమైతే మన ఆరోగ్యాలను, ప్రాణాలను కూడా త్యాగము చేయడానికి సిద్ధముగా ఉండాలి.

మన రాష్ట్రములో విద్యార్థుల పరిచర్య కొరకు జోసఫ్ అభిషేకరావు గారు తన ప్రాణాన్ని కూడా లెక్కచేయలేదు. స్టెరెట్ గారు తన జీవితాన్ని, యావదాస్తిని పరిచర్య కోసం సమర్పించాడు. సమర్పణ లేని సేవ సారము లేని సేవే. రక్షణను సిద్ధము చేయడానికి క్రీస్తు తన యొక్క ప్రాణాన్ని త్యాగము చేశాడు. ఆ సువార్తను ప్రకటించడానికి చిన్న చిన్న త్యాగాలు చేయడానికి ఇష్టపడకపోవడం ఎంతో బాధాకరం. 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఔట్ రీచ్ కళాశాలలకు వెళ్ళి వారానికి 30 నిమిషాలు సమయాన్ని కూడా కేటాయించలేకపోవడం, యంపిసి కోసం ఒక గంట కేటాయించలేని మనం పరిచర్య గూర్చి మాట్లాడుకోవడం బాధాకరం. కాన్ఫరెన్స్‌ల కోసం మాత్రం రోజుల తరబడి సమయాన్ని కేటాయిస్తున్నాం. విద్యార్థులను కలవడానికి, సువార్తను ప్రకటించడానికి , ఔట్రీచ్ కళాశాలలను ప్రభువు కోసం గెలవడానికి, చెమట చిందించడానికి మాత్రము మనకు సమయము లేదు. ఇలాంటి ధోరణి కొనసాగినంత కాలము మన రాష్ట్రాన్ని ఎప్పటికీ ప్రభువు కోసము గెలవలేము. “యేసుక్రీస్తు దేవుడైయుండి నా కోసం తన యొక్క ప్రాణము పెట్టినట్లయితే ఆయన కోసం నేను చేసే ఏ త్యాగం కూడా గొప్పది కాదు” అని అంటాడు సిటి స్టడ్ అనే భక్తుడు.

ఈ రోజుల్లో బాగా వినిపిస్తున్న మాట మేము ఓవర్ టైమ్ పరిచర్య చేస్తున్నామని. మన యొక్క పరిచర్యలో ఓవర్ టైమ్ పనిచేసే గ్రాడ్యుయేట్ గానీ, విద్యార్థిగానీ లేదు. మనం చేయాల్సిందే చేస్తున్నాము. యంపిసి, బైబిల్‌స్టడీస్, విద్యార్థులకు ఆతిథ్యం ఇవ్వడం అనేవి మనము చేయాల్సిన పనులు. మనము మన యొక్క బాధ్యతను నెరవేర్చినప్పుడు దానిని మనము ఓవర్ టైమ్ పరిచర్య అనకూడదు. మేము ఉద్యోగాలు చేసుకొంటూ, మేము చదువుకొంటూ ఓవర్ టైమ్ పరిచర్య చేస్తున్నామనే భావన మంచిది కాదు. ఎవరి కోసం చేస్తున్నాం? ఈ పని కోసమే కదా మనం పిలవబడింది. ఇది మన దర్శనం కాదా? మన హృదయ స్పందన కాదా? మనం చేసేది దేవుని కోసం కాదా? ఒకవేళ ఓవర్ టైమ్ దేవుని పనిని చేసినా అలా చేసినందుకు పరలోకంలో నిందించబడేవారు ఎవ్వరూ ఉండరు.

## ముగింపు

అనేకమంది గొప్పవారు తాము ఆరంభించిన పనిని ముగించలేకపోయారు. అసంపూర్ణంగా ఉన్న శిల్పాలు, అసంపూర్ణంగా ఉన్న పెయింటింగ్స్, అసంపూర్ణంగా ఉన్న పుస్తకాలు ఎన్నో ఉన్నాయి, పౌలు మాత్రం తాను ప్రారంభించిన పరిచర్యను తుదముట్టించానని ధైర్యముగా ప్రకటన చేశాడు. మన ప్రభువు కూడా తండ్రి తనకు అప్పగించిన పనిని సంపూర్ణంగా నెరవేర్చాడు. గనుక మనము కూడా ప్రభువు మనకిచ్చిన పనిని అసంపూర్ణంగా ముగించకుండా తుదముట్టించడానికి మన ప్రభువును, పౌలును అనుసరిద్దాము. మనకున్నది ఒకే ఒక జీవితం. ఈ జీవితంలో ఏమి చేశామన్నది నిత్యత్వంలో లెక్కించబడుతుంది.

**– డా. నాసరయ్య,** వైజాగ్




# మన నినాదం

"మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను దేశాన్ని ప్రభావితం చేయడం" యుఇయస్ఐ పరిచర్యకు దేవుడిచ్చిన దర్శనం. ఈ ఉద్యమంలోని విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ అందరూ దేనికోసం ప్రయాసపడాలో, దేనికోసం ఎదురుచూడాలో సుస్పష్టంగా ఉంది. విద్యార్థుల పరిచర్యలో ఇప్పటి వరకు కొంతవరకు ప్రయాసపడ్డాం. అయితే మన పరిచర్య ప్రారంభమై 68 సంవత్సరాలు గడిచినా '0.1%' విద్యార్థులను కూడా చేరలేదన్న కఠోర వాస్తవం మనందరికి విదితమే. నిజమే, కోత విస్తారంగా ఉంది. పనివారు కొద్దిగా ఉన్నారు. కన్నీటి ప్రార్థనతో కదలక తప్పదు, ప్రయాసపడక తప్పదు మరి.

### మన స్లోగన్

"ప్రతి కళాశాల విద్యార్థికి సువార్త, ప్రతి కళాశాలలో ఇయు విద్యార్థుల సాక్షి సమూహం, ప్రతి కాలేజ్ సెంటర్‌లో ఒక ఇజియఫ్ సమూహం".

**ఈ స్లోగన్ ప్రకారం మనం మూడు పనులు చేయాలి.**

### 1. ప్రతి కళాశాల విద్యార్థికి సువార్తను ప్రకటించాలి

మా పట్టణంలో పరిచర్య చాలా సంవత్సరాల క్రితం ప్రారంభమై అది ఇప్పటికీ జరుగుతూనే ఉందని మనం సంతోష పడుతూ ఉంటాము. మంచిదే. 'ప్రతి కళాశాల విద్యార్థికి సువార్తను ప్రకటించడం' అనే విషయంలో ఎంత పురోగతి సాధించాం? ఉదాహరణకు ఒక పట్టణంలో 35 కాలేజీల్లో 40,000 మంది విద్యార్థులు ఉంటే ఒక విద్యా సంవత్సరంలో సువార్తను ప్రకటిస్తుంది కేవలం సుమారు 1000 మందికి మాత్రమే. అంటే 2.5% విద్యార్థులు మాత్రమే సువార్తను వింటున్నారు. ఆ విద్యాసంవత్సరంలో 39,000 మందిని మనం వదిలేస్తున్నాము. వారి గురించి అంతగా ఆలోచించడం లేదు, ప్రార్థించడంలేదు, ప్రయాపడడం లేదు. వారి రక్షణ గూర్చిన బాధ్యత మనకు లేదా?

### 2. ప్రతి కళాశాలలో ఇయు విద్యార్థుల సాక్షి సమూహం ఉండాలి

ఒక పట్టణంలో 35 కాలేజీలు ఉంటే కేవలం 6-10 కాలేజీల్లో మాత్రమే ఒకరు లేదా ఇద్దరు ఇయు విద్యార్థులు ఉంటున్నారు. మిగిలిన 25 కాలేజీల్లో విశ్వాస విద్యార్థులు ఉండడం లేదు, రీచ్ అయిన కాలేజ్ సెంటర్‌లో అన్‌రీచ్డ్ కాలేజీలుగా ఉంటున్నాయి. రీచ్ అయిన కాలేజీల్లో కూడా ఒకరు ఇద్దరు ఉంటే వారిని సాక్షి సమూహం అనరు. కనీసం 5-10 మంది ఉంటే వారిని ఒక గుంపు అని అనవచ్చు. దీనిని బట్టి మన పరిచర్య, ప్రయాస ఏ స్థాయిలో ఉందో మనం గమనించవచ్చు.

## 3. ప్రతి కాలేజ్ సెంటర్‌లో ఒక ఇజియఫ్ సమూహం ఉండాలి.

కాలేజ్ సెంటర్ అంటే "ఒక కళాశాల లేదా ఒకటి కంటే ఎక్కువ కళాశాలలు ఉన్న ప్రదేశం లేదా పట్టణం". మన స్లోగన్ ప్రకారం ప్రతి కాలేజ్ సెంటర్‌లో ఒక ఇజియఫ్ సమూహం ఉండాలి. ఈ విషయంలో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ సభ్యులు వృద్ధిచెందే విషయంలో ఎంతో ప్రయాసపడాలి. కొన్ని ఇజియఫ్‌లలో సభ్యులు ఎక్కువగా ఉన్నప్పటికీ అక్కడ విద్యార్థుల మధ్య పరిచర్య అంతంత మాత్రంగానే ఉంటుంది. పరిచర్య విస్తరణ దృష్ట్యా జోన్స్‌గా ఏర్పడాల్సిన పరిస్థితులు ఉన్నా అలా ఏర్పడడంలో ఇంకా వెనుకబడి ఉన్నాము.

### ఈ సమస్యలను అధిగమించాలంటే?

**ప్రణాళికలు రూపొందించాలి:** ఔట్‌రీచ్‌లోని కాలేజీలను రీచ్ అవ్వడానికి ప్రణాళికలు వేసుకొంటున్నట్లే స్థానికంగా ఉన్న ప్రతి కాలేజ్ విద్యార్థికి సువార్తను ఎలా ప్రకటించాలి, దానికి అవసరమైన కార్యక్రమాలు, ప్రతి కాలేజ్‌లో ఒక ఇయు సమూహం ఏర్పడాలంటే ఏం చేయాలో ప్రార్థనాపూర్వకంగా ఇయు, ఇజియఫ్ కమిటీవారు ప్రణాళికలు రూపొందించాలి.

**వివరాలు సేకరించాలి:** స్థానికంగా మన పట్టణ వివరాలు మనమందరం తెలుసుకొని ఉండాలి. ప్రస్తుతం మీ పట్టణంలో ఎన్ని కాలేజ్‌లు ఉన్నాయి? ఏ కాలేజ్‌లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు? అది బాలురకా? బాలికలకా? తెలుసుకోవాలి.

**వివరాలు సభ్యులకు తెలియజేయాలి:** ఈ వివరాలు ఇయు, ఇజియఫ్ కమిటీలు సభ్యులందరికీ అకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే చెప్పాలి. అలా తెలిసినప్పుడే ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్, స్టాఫ్ అర్థవంతంగా ప్రార్థన చేస్తారు.

**ఆ కాలేజ్ కోసం అడుగుపెట్టి అడగాలి:** ప్రతి గ్రాడ్యుయేట్‌కు, స్టూడెంట్‌కు ఇది అలవాటు కావాలి. ప్రోగ్రామ్‌లాగా కాకుండా హృదయాంతరాల్లో నుంచి భారమైన ప్రార్థన ఉద్భవించాలి. క్రమంగా ప్రార్థన చేయాలి, వ్యక్తిగత ఉపవాస ప్రార్థనలో ఈ కాలేజ్‌ల కోసం, విద్యార్థుల కోసం కన్నీటితో ఎలుగెత్తి



విజ్ఞాపన చేయాలి. కాలేజ్ ప్రాంగణంలోని గోడ, గేట్లు పట్టుకొని ప్రార్థన చేయాలి. మీరు అడుగు పెట్టు ప్రతి స్థలం మీ కిచ్చెదను అని వాగ్దానం చేసిన దేవాది దేవునికి మొరపెడదాం. ఇది మన పితరులు మనకు నేర్పిన మాదిరి.

**కాంటాక్ట్స్ కోసం వెదకాలి:** పరిచయస్తులైన విద్యార్థి లేదా లెక్చరర్ ఎవరైనా ఉన్నారేమోనని వెదకాలి. వారిద్వారా బైబిల్ స్టడీ ప్రారంభించడానికి సన్నాహాలు చేయాలి.

బ్ర. జోసఫ్ అభిషేకరావు గారు, మద్రాసులో ఇదే రకంగా చేసి ఒక ఇబియస్‌ను ప్రారంభించి అక్కడ విశ్వాస విద్యార్థుల సాక్షి గుంపు ప్రారంభించిన విధానం మనకు ఆదర్శప్రాయం. బ్ర. జోసఫ్ అభిషేకరావు గారి జీవిత చరిత్ర "గోధుమ గింజ" అందరం చదివి స్ఫూర్తి పొందుదాం.

**ఇబియస్ ప్రారంభించాలి:** కాంటాక్ట్స్ దొరికిన పిదప అక్కడ ఇబియస్ ప్రారంభించాలి. క్రమంగా సంవత్సరం మంతా కొనసాగేటట్లుగా చూడాలి. ఈ క్రమంలో ఎన్నో అవాంతరాలు ఏర్పడొచ్చు. అవి బయటనుంచి రావొచ్చు లేదా వ్యక్తిగతమై ఉండొచ్చు.

**వీరి కోసం గాస్పల్ రిట్రీట్, గాస్పల్ ఈవినింగ్ ప్లాన్ చేయాలి:** వీరికోసం ప్రత్యేకంగా గాస్పల్ రిట్రీట్‌లు, గాస్పల్ ఈవినింగ్స్ ఆలోచించాలి. లేదా ప్రక్క జోన్‌లో సువార్త అందించే కార్యక్రమాలకు ఆహ్వానించవచ్చు. తద్వారా వారు రక్షణ ఆనందాన్ని స్వంతం చేసుకొనే భాగ్యం పొందుకొంటారు.

విశ్వసించిన వారిని క్రీస్తు శిష్యులుగా చేయడమే మన పని. వారిని యంపిసిలో భాగస్వామ్యం చేయాలి. అప్పుడే మన దర్శనాన్ని సాకారం చేసుకొనే అవకాశం ఉంటుంది.

### జోన్స్‌గా ఏర్పడాలి

ఒకటిగా ఉన్న స్థానిక సహవాసాలు రెండుగా ఏర్పడాలి. ఇలా రెండు జోన్స్‌గా ఏర్పడడం వలన ఆయా ఇయు పరిధిలో ఉన్న అన్ని కళాశాలల విద్యార్థులపై మరింత శ్రద్ధను కనపరచడానికి, ప్రభువుకోసం వారిని గెలుచుకోవడానికి ఉపయోగ పడుతుంది. సహవాసంలో ఎక్కువ మంది ఉన్నారనో, బైబిల్ స్టడీస్‌కి హాజరవ్వాలంటే ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సివస్తుందనో తదితర కారణాల వల్ల కాకుండా ప్రతి కళాశాలలో విశ్వాస విద్యార్థుల సాక్షి సమూహం ఉండాలని, వారి ద్వారా ఆ కళాశాలలో పరిచర్య నిరంతరాయంగా కొనసాగాలన్నదే రెండు జోన్స్ ఏర్పడటానికి ప్రధాన కారణంగా ఉండాలి.

### జోనలైజేషన్ అవసరత

- ❖ ఒక ఇయులో ఇంకా చేరుకోని అనేక కళాశాలను చేరుకోవడానికి.
- ❖ పరిచర్య జరగని కళాశాలలోని విద్యార్థులు ఒక్కసారి కూడా సువార్త వినకుండా వారి కోర్స్‌ని ముగిస్తున్నారు. అలాంటి వారిమీద దృష్టిపెట్టడానికి.
- ❖ పరిచర్య జరుగుచున్న కళాశాలలోనే ఉంటూ మిగిలిన ప్రాంతాలకు విస్తరించడం లేదు.
- ❖ మన విజన్ మరియు మిషన్‌ని అన్ని కళాశాలలలోని విద్యార్థులకు అందించాల్సిన అవసరత ఉంది.
- ❖ చిన్న సమూహాలతో పరిచర్య జరిగించి ఎక్కువ కళాశాలలను చేరుకోగలం.
- ❖ ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ పరిచర్యలో ప్రభావవంతంగా పాల్గొనడానికి అవకాశం ఉంటుంది.

### జోనలైజేషన్ ఎలా చేస్తే మంచిది?

- ❖ పట్టణం లేదా నగరం యొక్క భౌగోళిక స్వరూపాన్ని ఆధారం చేసుకొని స్పష్టమైన విభజన జరగాలి. సరిహద్దులు స్పష్టంగా ఉండాలి. రెండు జోన్స్‌గా ఏర్పడితే వాటి స్వరూపం, స్వభావాలు, సరిహద్దులు తదితర వివరాలు ఉన్నప్పుడు గందరగోళానికి తావుండదు.
- ❖ కొత్తగా ఏర్పడిన జోన్స్‌లోని విశ్వాస విద్యార్థులు, ఇజియఫ్ సభ్యులు తమ పరిధిలోని కళాశాలలలోని విద్యార్థుల కోసం పరిచర్యను ఉత్సాహంగా ప్రారంభించాలి
- ❖ ఏ కళాశాలలో అయితే సాక్షి సమూహం లేదో అనగా విశ్వాసులైన విద్యార్థులు లేరో అలాంటి కళాశాలను విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు ప్రార్థన, పరిచర్య కోసం కేటాయించాలి.
- ❖ ఒకవేళ విశ్వాస విద్యార్థులు లేకపోతే ఈ బాధ్యత గ్రాడ్యుయేట్స్ వహించాలి. తమ పరిధిలోని కాలేజీల్లో అడుగుపెట్టి ప్రార్థించాలి.
- ❖ సొంతంగా ఇబియస్, బిబియస్, ఇయర్‌ప్లాన్, యుఇయస్ఐ నేషనల్, యుఇయస్-ఏపికి ఆర్థిక సహకారం అందించడం, ఇజియఫ్, ప్రార్థన సమావేశాలు జోన్స్‌గానే జరుపుకోవాలి.
- ❖ ఇంత శాస్త్రీయంగా జరగాలంటే స్థానిక కమిటీ సభ్యులు ఎంతో బాధ్యతాయుతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే సహవాసంలోని సభ్యులకు జోన్స్‌గా ఏర్పడే విషయంలో స్పష్టత ఉంటుంది, పరిచర్యలో ఫలితం ఉంటుంది. అనవసరమైన పోటీతత్వాన్ని మొగ్గలోనే కమిటీ వారు తుంచివేయాలి.

### ముగింపు

మన తరంలోని విద్యార్థులను ప్రభువు కోసం గెలుచుకొని వారిని ప్రభువు శిష్యులుగా పోషించి వారిని రానున్న రోజుల్లో దేశానికి, క్రైస్తవ సంఘానికి ప్రయోజనకరమైన వారిగా చేసే పనిలో మనం ఉన్నాం. ఆయన పనికి మనలను యోగ్యులనుగా ఎంచిన ప్రభువుకు విధేయత చూపిస్తూ, పరిచర్యలో శక్తి లోపం లేకుండా పాల్గొందాం. మన ఊర్లో ఉన్న ప్రతి కాలేజ్‌లో విశ్వాసులైన విద్యార్థులు యేసుక్రీస్తు శిష్యులుగా నడుస్తూ, ఆయన కోసం సాక్షులుగా నిలబడే సుందర దృశ్యం కనబడేటట్లు ప్రార్థిద్దాం, ప్రయాసపడదాం.

**– జే. పాల్ శామ్యూల్,** నంద్యాల



# ప్రతిభావంతులకు ప్రభువును పరిచయం చేద్దాం

"ఆలోచించగల వారికి సువార్త చెప్పగలవా?" అని తనతో పనిచేసే ఒక క్రిస్టియన్ ప్రొఫెసర్ ప్రొ. ఇనాక్ గారికి విసిరిన సవాలు యుఇయస్ఐ ఆవిర్భావానికి నాంది పలికింది. అప్పటి వరకు వైజాగ్ సముద్ర తీరంలో జాలర్లకు, పేదవారికి, రోగులకు సువార్త ప్రకటిస్తున్న ఆయన దృష్టి విద్యార్థుల మీదికి, యూనివర్సిటీ ప్రొఫెసర్స్ మీదికి మళ్ళింది. దేవుడు తనను విద్యార్థుల మధ్య ఉంచారు కాబట్టి వారికి సువార్త చెప్పడమే తన బాధ్యతగా గుర్తించి, ఎక్కువ సమయం వారికే కేటాయించారు. ఆ విధంగా ప్రతిభావంతులైన మెడికల్ కాలేజ్ విద్యార్థులకు యేసుక్రీస్తును రక్షకునిగా పరిచయం చేసి వారిని సమృద్ధియైన జీవంలోనికి నడిపించగా వారంతా డాక్టర్స్‌గా ఆసుపత్రుల్లో, బాధ్యతగల ఉద్యోగాలలో ఉండి, దేవుని కోసం జీవించారు.

ఈ తరములో మనము సువార్త బోధించే విద్యార్థులలో ఎక్కుమంది విద్య, ఆరోగ్య, ఆర్థిక, మానసిక, చిన్న, పెద్ద సమస్యలతో ఉన్నవారే. ఎందుకంటే వారిని సిలువవైపు ఆకర్షించడం కొంతవరకు సులభమే. మరొకవైపు ప్రతిభావంతులను, కార్పొరేట్ విద్యార్థులను చేరుకోవడం కష్టమని వారిని అశ్రద్ధ చేసే ఆలోచనలో ఉన్నామా? ఇలా చేయడం వలన మన దర్శనాన్ని పరిమితం చేస్తున్నామేమో! ఒక్కసారి ఆలోచిద్దాము!

## ప్రతిభావంతులెవరు?

చక్కని మేధోశక్తి, నిపుణత, ఆలోచించగల సామర్థ్యం, విద్యలో జ్ఞానము కలిగిన వారిని ప్రతిభావంతులుగా గుర్తించవచ్చు. వీరు అత్యంత తెలివి తేటలతో చక్కగా చదువుచున్న విజయవంతమైన వ్యక్తులు. వీరు దేశ భవిష్యత్‌కు మూలస్థంభాలు, భావి భారత పౌరులు.

ఒక్క క్షణం కార్పొరేట్ విద్యార్థుల గురించి కూడా ఆలోచించాలి. వీరు ప్రెజర్ కుక్కర్ జీవితాల విద్యతో,

ఆలోచనా శక్తిని నిర్వీర్యము చేసుకొని, వారికిచ్చిన మెటీరియల్ని బట్టీ కొడుతూ, చదువే లోకముగా, నిర్ధిష్టమైన టైమ్ టేబుల్, ఆదివారం పరీక్షలు, క్లిష్టమైన జీవితాల్ని గడుపుతుంటారు. అనుకున్నది సాధించలేకపోతే నేను వ్యర్థుడను అనే భయంతో పరుగెడుతున్న వారు. ఇక్కడ విద్య ఒక వ్యాపారం. ఇక తలిదండ్రుల విషయానికొస్తే మా పిల్లలు ఈ కార్పొరేట్ విద్యా సంస్థలలో చదవకపోతే జీవితంలో రాణించలేరనే భయం, ఫీజులు ఎంతైనా, అప్పు చేసైనా చదివించాలనే తపన, తోటివారి పిల్లలతో పోల్చుకోవడం, తమ పిల్లలు ఇంజనీర్/డాక్టర్ కావాలన్న ఒకే ఒక కోరికతో పిల్లల మనోభావాలకు తావివ్వలేని పరిస్థితులు.

## వీరిని ఎందుకు పట్టించుకోవడంలేదు?

ప్రతిభావంతులైనంత మాత్రాన వారికి సువార్త సందేశం అవసరం లేదా? దేవుని సంకల్పం వారి పట్ల లేదా? ఆలోచనా శక్తి కలిగి మనల్నే ప్రశ్నలు అడిగే వీరితో మనకెందుకులే, వారు వినరులే అనే నిర్లక్ష్యధోరణా? ప్రస్తుత గణాంకాల ప్రకారం మనదేశంలో 50,404 కాలేజ్ సెంటర్స్ ఉంటే వాటిలో కేవలం 743 సెంటర్స్ని రీచ్ అయ్యాము. అంటే మనం రీచ్ అయ్యింది 1.45% మాత్రమే. కోతెంత విస్తారంగా ఉందో మనకు తెలుస్తూనే ఉంది. ఏ వయసులోనైతే రక్షణ అనుభవంతో యుఇయస్ఐ దర్శనంతో అడుగులు వెయ్యాలో ఆ సమయంలో తీరిక లేదని, చెప్పినా వినిపించుకోని స్థితిలో ఉన్న ప్రతిభావంతులైన, ఈ కార్పొరేట్ విద్యార్థులను, చేరుకోవడం ఎలా?

## వీరి ఆలోచనా విధానం

వాస్తవానికి విద్యార్థులు, అందులోనూ ప్రతిభా వంతులు తొందరగా ఒప్పుకోరు, చాలా ప్రావీణ్యత గలవారమని, పురోభివృద్ధిని సాధిస్తున్నామని, జ్ఞానవంతులమని, కత్తిలాంటి పదును కలవారమని, మీరు చెప్పే విషయాలు వినేంత సమయం లేదని, మేము మంచిగా ఉన్నాము కాబట్టి మాకు ఎవరూ చెప్పనవసరం లేదని, దేవుడు, భక్తి జీవితము ఇప్పుడే కాదని, పరీక్షలు/ఉద్యోగ అవసరాల సమయంలో ఎవరో ఒకరి ప్రార్థన సరిపోతుందని, మాకు స్వేచ్ఛా జీవితం కావాలని ఆలోచించే వైఖరి, ప్రవర్తన కలిగి ఉన్నారు.

> **చిన్న చిన్న లేదా అడపా దడపా వచ్చే ఆటంకాలను భూతద్దంలో చూసుకొంటూ నావల్ల కాదులే, నేను చెయ్యలేనులే అని చతికిల పడిపోకూడదు. పిరికితనాన్ని అధిగమించాలి. ఇది నా పొలము, నా పని అని వారు ప్రభువును అంగీకరించే వరకు అఖండ దీక్షతో సువార్తను ప్రకటించాలి. బాటలు వేసి ఉంటేనే నేను నడుస్తాను అనే ధోరణి కాకుండా, మన పితరులైన జోసఫ్ అభిషేకరావు, ఇనాక్ గారిలా కాలేజ్ ప్రాంగణాలను క్రీస్తు కొరకు స్వాధీనం చేసుకోవాలి.**

## వీరికి సువార్తను ఎలా ప్రకటించాలి?

### 1. అత్యాసక్తితో కూడిన అలుపెరగని ప్రార్థన

ప్రార్థనను మించిన ఆయుధం/ఔషధం లేదు. పౌలు, సీలలు చెరసాలలో బంధింపబడి ఉన్నప్పుడు సంఘము అత్యాసక్తితో ప్రార్థించగా చెరసాల పునాదులు అదిరి వారు విడుదల అయ్యారు. బిల్లీ గ్రేహంగారు పదే పదే నొక్కి చెప్పిన మాట నా పరిచర్య పురోగతికి మూడు రహస్యాలు మొదటిది ప్రార్థన, రెండవది ప్రార్థన, మూడవది ప్రార్థన. ప్రభువా ఆంధ్రాను నాకివ్వు అని వేదనతో, భారముతో ప్రార్థించి గోధుమ గింజగా మారిన బ్ర. జోసెఫ్ అభిషేక రావుగారి స్ఫూర్తి మనకు కావాలి. అత్యాసక్తితో కూడిన అలుపెరుగని ప్రార్థన అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది. వీరిని ప్రభువు దగ్గరకు నడిపిస్తుంది.

### 2. అవసరాల్ని అడిగి తెలుసుకోవాలి

సువార్త లేని విశ్వవిద్యాలయాలు, నైతికంగా పాడైపోయి, శత్రువైన సాతాను చొరబడే ప్రాంతాలని గుర్తించి నెహెమ్యా మాదిరి మన అసమర్థతను ఒప్పుకొని, అక్కడి విద్యార్థుల అవసరాలను పరిశీలనగా అడిగి తెలుసుకొని ఆత్మీయ సహాయాన్ని అందించాలి.

### 3. అడుగుపెట్టి అడగాలి

వాగ్దానము చేతబూని యెహోషువ వలె నిబ్బరం



ఈ జడ్, ఆల్ఫా జనరేషన్ యొక్క వేష, భాష, ఇతరత్రా పైకి కనబడే తీరును బట్టి మనము వారిని తృణీకరిస్తే ప్రమాదం పొంచి ఉన్నట్లే. వాటిని బట్టి వారికి తీర్పు తీర్చడం, క్రీస్తులేని వారిగా గుర్తించడం మంచి పద్ధతి కాదు. మొదట మనము వారిని వారిగా అంగీకరించాలి. ఒకవేళ వారిని విడిచిపెడితే ప్రభువుకోసం ఎప్పటికీ గెలవలేము.

కలిగి ధైర్యంగా ప్రతిభావంతులు ఉన్న విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో అడుగుపెట్టి ప్రభువును పట్టుదలతో, నిబద్ధతతో అడగాలి. కాంటాక్ట్స్ కోసం విశ్వాసంతో ప్రయత్నించాలి. వారి పట్ల దేవుని ఉద్దేశాన్ని గ్రహించాలి. దేవుని మనసును అర్థం చేసుకోవాలి. చిన్న చిన్న లేదా అడపా దడపా వచ్చే ఆటంకాల ను భూతద్దంలో చూసుకొంటూ నావల్ల కాదులే, నేను చేయలేనులే అని చతికిలపడిపోకూడదు. పిరికితనాన్ని అధిగమించాలి. ఇది నా పొలము, నా పని అని వారు ప్రభువును అంగీకరించేంత వరకు అఖండ దీక్షతో సువార్తను ప్రకటించాలి. బాటలు వేసి ఉంటేనే నేను నడుస్తాను అనే ధోరణి కాకుండా, మన పితరులైన జోసఫ్ అభిషేకరావు, ఇనాక్ గారి లాగా వారి కాలేజ్ ప్రాంగణాలను క్రీస్తు కొరకు స్వాధీనం చేసుకోవాలి.

### 4. అక్కున చేర్చుకోవాలి, అంగీకరించాలి

ఈ జడ్, ఆల్ఫా జనరేషన్ యొక్క వేష, భాష, ఇతరత్రా పైకి కనబడే తీరును బట్టి మనము వారిని తృణీకరిస్తే ప్రమాదం పొంచి ఉన్నట్లే. వాటిని బట్టి వారికి తీర్పు తీర్చడం, క్రీస్తులేని వారిగా గుర్తించడం మంచి పద్ధతి కాదు. మొదట మనము వారిని వారిగా అంగీకరించాలి. ఒకవేళ వారిని విడిచిపెడితే ప్రభువుకోసం ఎప్పటికీ గెలవలేము. అలా కాకుండా వారి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలి, దేవుని వాక్యముతో సంధించాలి, ఏ వ్యక్తులైనా సిలువ దగ్గర మాత్రమే తమను తాము విరగగొట్టుకోవడానికి ఇష్టపడతారు. తద్వారా తమలో దేవునికి వ్యతిరేకముగా ఉన్న ప్రతి ఒక్కటి నెమ్మదిగా విడిచి పెడతారు. అంతేకానీ, ఒక్కసారిగా మార్పుకోసం బలవంతం చేయడం, బహిరంగ విషయాల నిర్ధారణతో, స్వంత అభిప్రాయాల ఆధారంగా, విలువైన ఆత్మీయ విషయాలను దూరం చేయడం ఘోరమైన తప్పిదం. అందువలననే మత్తయి 15:1-20లో క్రీస్తు మనుష్యులు కల్పించిన పద్ధతుల కన్నా వారి ఆత్మీయ అవసరతకు ప్రాధాన్యతనివ్వాలి అని సూచించారు.

### 5. అండగా ఉండాలి, ఆదరణ చూపించాలి, ఆతిథ్యం ఇవ్వాలి

విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నప్పుడు, ఏమీ పట్టనట్టుగా నాకెందుకులే అని కానీ, విమర్శనాత్మక ధోరణి గానీ లేకుండా నేనున్నాను అని వారికి అండగా నిలిస్తే వారు తప్పకుండా ప్రభువు వైపు ఆకర్షితులవుతారు, ఆ సమయంలోనే వారికి దేవుని ప్రేమను చూపాలి, కష్ట కాలములో అండగా నిలిచే క్రీస్తు ప్రేమను పరిచయం చేయాలి.

సాధారణంగా వారంలో ఒక గంట సేపు బైబిల్ స్టడీ ఉంటే హడావిడిగా హాస్టల్‌కి వెళ్ళి నేరుగా వాక్యము, ప్రార్థనతో అయిపోయింది అన్నట్లుగా కాకుండా మొదట వారిని అర్థం చేసుకోవాలి. వారితో వ్యక్తిగతంగా సమయాన్ని గడపాలి. వారి క్లిష్ట పరిస్థితులలో, నిరుత్సాహంలో ప్రేమగల మాటలతో వారిని ఆదరించాలి. దేవుడు సహాయం చేస్తాడనే ధైర్యం ఇవ్వాలి. వారి పేరు, తలిదండ్రులు, తోబుట్టువులు, ఆరోగ్య, విద్యా మొదలైన విషయాల ను అడిగి తెలుసుకోవచ్చు. వారు వ్యక్తిగతంగా మనతో పంచుకొన్న విషయాలకొరకు ప్రార్థించాలి, గోప్యంగా ఉంచాలే తప్ప మరెవ్వరికో వాటిని చెప్పి వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదు. లేకపోతే జీవితములో ఇంకెన్నడూ వారు నిన్ను నమ్మరు సుమా!

కేవలము వాక్యాన్ని బోధించి ఆత్మీయ ఆకలి తీరిస్తే సరిపోతుందని చేతులు కడిగేసుకోకుండా, వారిని ఇంటికి ఆహ్వానించి వారికి ఆతిథ్యం ఇవ్వాలి.

క్రీస్తే మన మాదిరి. వారు ఆకలితో ఉన్నందున వారి మీద కనికరపడి ఆహారం పెట్టాడు (మత్తయి 15:32-38).

### 6. ఆకట్టుకోవాలి

మేము చాలా ఆధ్యాత్మికులమనే ధోరణితో వ్యవహరించడం ప్రస్తుత కాలపు ప్రతిభావంతులకు మింగుడుపడని విషయం. వారిని క్రీస్తు వైపుకు ఆకర్షించడానికి చిన్న చిన్న ఆటలు, ఐస్‌బ్రేకర్స్ ఉంటే బాగుంటుంది. వారికి బోర్ కొట్టకుండా చూసుకోవాలి. సమయాన్ని పాటించాలి. ఎక్కువ సమయంలో ఎక్కువ చెప్పగలము అనే మూస నుంచి తక్కువ సమయంలో వారి హృదయాలను సిద్ధపరచాలి. మనం ప్రిపేర్ అయ్యిందంతా చెబితే వారు మధ్యలో ఆగిపోతారు. అది మనకు మనం చెప్పుకోవడం అవుతుందేకాని వినేవారికి కాదు సుమా!

"ఆత్మతో పాడుదును – మనసుతోనూ పాడుదును" అనే విషయాన్ని స్ట్రెరెట్ గారు నొక్కి చెప్పేవారు. తనకు, విద్యార్థులకు మధ్య ఉన్న గ్యాప్‌ను ఆయన సంగీతము ద్వారా ఛేదించి మంచి సంబంధాన్ని ఏర్పరచుకొనేవారు. చెరగని చిరునవ్వుతో అకార్డియన్, పియానో, ట్రంపెట్ వంటి వాయిద్యాలు చక్కగా వాయిస్తూ, పాటల భావాన్ని వివరిస్తూ, పదాల ఉచ్చరణ సవరిస్తూ గొప్ప ఉత్సాహంతో నేర్పిస్తుంటే విద్యార్థులకు పరలోకంలో ఉన్నామనే అనుభూతి కలిగేదట. 'ఇక్కడికి ఎందుకొచ్చామురా బాబు' అనే భావన వారిలో ఉండకుండా చూసుకోవాలి. 'దేవుడు సృష్టి' అనే ఫిల్మ్ ప్రదర్శించడం ద్వారా స్ట్రెరెట్‌గారు విద్యార్థులను ఆకట్టుకొని దేవుని గూర్చి ఆలోచింపచేసేవారు.

### 7. అప్‌డేట్ అవ్వాలి

ఈ తరానికి అనుగుణంగా టెక్నాలజీ వాడే విషయంలో అప్‌డేట్ అవ్వాలి, నాకు తెలియదు, చేతకాదు అనే మాటలకు తావు లేకుండా ఉంటే మంచిది. మన వాక్యధ్యానం నేటి తరానికి తగ్గట్టుగా, సృజనాత్మకంగా వారికి కనెక్ట్ అయ్యే విధంగా, వారి సమస్యలకు సమాధానం చెప్పే విధానంలో ఉండాలి. వారు మాట్లాడడానికి అవకాశం ఇవ్వాలి. సిలువ దగ్గర ప్రతి సమస్యకు/పాపానికి పరిష్కారముందని, క్రీస్తే పరలోకానికి మార్గమని తెలియచేయాలి. వాక్యాన్ని స్పష్టంగానూ, సులభంగానూ, దృఢంగా బోధించాలి. మన ప్రఖ్యాతి, ప్రతిభ, జ్ఞానము ప్రదర్శించి వారిని సందిగ్ధంలోనికి నెట్టకూడదు.

### ఒక విద్యార్థిని అనుభవం

ఒక యన్‌ఐటి విద్యార్థి ఈ విధంగా పంచుకొంది "నేను ఈ రంగుల వలయంలో చిక్కుకొంటూ అందంగా, ఆనందంగా ఉందనుకొంటూనే జారి పోతున్నవేళ, అయ్యో నశించిపోతున్నాను" అనే నా ఆత్మ కేక విన్నట్టుగా "బైబిల్ స్టడీకి రా చెల్లి, సాయంత్రం అక్క వస్తారు" అని పిలిచిన మా సీనియర్ అక్క మాట నా చెవిని పడింది. ఆ రోజు వాక్య ధ్యానము నా ప్రాణాన్ని తెప్పరిల్లచేసి, క్రీస్తు రక్త ప్రోక్షణతో, జయజీవితముతో ముందుకు సాగేటట్లు చేసింది యుఇయస్ఐ పరిచర్య. విద్యార్థుల కొరకు ఇలాంటి ఒక పరిచర్య ఉన్నదని నాలాంటి వారి కందరికి తెలియజేయాలని నేను ఆశిస్తున్నాను". ఇలాంటి విద్యార్థులు ఎంతోమంది ఉన్నారని, వారి అవసరాల్ని మనం గమనించి అర్థం చేసుకోవాలి.

### నా ఆత్మీయ అనుభవం

ఒక విద్యార్థిగా ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నప్పుడు నన్ను మలిచి, చెక్కి నాలో ఉన్న ప్రతిభను శోభిల్ల చేసింది యుఇయస్ఐ. అక్కలు, అన్నలు నా మీద తీసుకొన్న శ్రద్ధ, నన్ను దేవునిలో నడిపించిన విధానం, నన్ను క్రీస్తు కొరకు ఒక యోధురాలిగా నిలబెట్టింది, పరిస్థితులకు అతీతమైన, మనుష్య జ్ఞానానికి అందని స్థితిలో దేవుని మహిమపరచడానికి సాధనమైంది. అనేక మంది ఆత్మీయ పిల్లలను కలిగి ఉండే గొప్ప అవకాశం కల్పించింది. ఈ విధముగా నన్ను ప్రభువు కొరకు నిలబెట్టిన యుఇయస్ఐ పరిచర్యకు, అండగా నిలిచిన ప్రతిఒక్కరికి క్రీస్తు పేరట నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

### ముగింపు

ఈ తరానికి సేవ చేయడానికి పిలువబడిన మనము అగ్నిలోనుండి లాగినట్టు కొందరు విద్యార్థుల నైనా ప్రభువు కొరకు గెలుచుకుందాం. వారు దానియేలు వలె ప్రపంచాన్ని ఏలే నాయకులు కాగల రు, పౌలు వలె గొప్ప సువార్తికులు కాగలరు. గనుక మనం ప్రతిభావంతుల్ని నిర్లక్ష్యం చేయకూడదు.

**– డా. డి.ఆర్. సలోమి సునీత**
తాడేపల్లిగూడెం

# పరిచర్యలో సమస్యలు

కర్ర, గడ్డి, కొయ్య కాలు – ఈ పదార్థాలు సేకరించడానికి, వాడడానికి గొప్ప ప్రయత్నం ఏమీ చేయనవసరం లేదు. ఇవి పైకి చక్కగానే కనబడవచ్చు కానీ కాలిపోతే బూడిద మాత్రమే మిగులుతుంది. కొన్నిసార్లు దేవునికి మనం చేసే పరిచర్య నాణ్యత ఇలానే ఉండవచ్చు. మనం కొంత వరకే చూడగలం కానీ దేవుడు ఆ బూడిదను బట్టి మన సేవా ప్రమాణాలను సరిగ్గా బేరీజు వేయగలడు.

పౌలు పరిచర్యను గురించి ప్రస్తావించిన సందర్భంలో ఈ మాటలు కొరింథీ సంఘానికి రాశాడు "ఎవడైనను ఈ పునాది మీద బంగారము, వెండి, వెలగల రాళ్ళు, కఱ్ఱ, గడ్డి, కొయ్యకాలు మొదలైన వాటితో కట్టిన యెడల వాని వాని పని కనబడుతుంది (1 కొరింథీ 3:12).

### పరిచర్య ఏది కాదు?

పరిచర్య దేవుడు మనకప్పగించిన పని, మనం నిర్వర్తించాల్సిన బాధ్యత. అది గొప్ప ఆధిక్యత, ఎంతో ప్రశస్తమైనది, బరువైనది, భారమైనది, క్లిష్టమైనది కూడా. అయితే ప్రస్తుత కాలంలో నవతరం బోధకులు ప్రచారం చేస్తున్నట్లు క్రైస్తవ జీవితం అంటే అన్నింటిలో అభివృద్ధి, కావలసినంత సంపద, సంపూర్ణ ఆరోగ్యం, క్రైస్తవ పరిచర్య అంటే రెడ్‌కార్పెట్ ఆహ్వానం, సమస్యలు ఫ్రీ అని వర్ణించే చిత్రాలు కాదు.

### పరిచర్య అంటే?

దేవుని నిబద్ధత, చిత్తశుద్ధి, నమ్మకం, సమర్పణతో వెంబడించిన దైవభక్తుల జీవిత అనుభవాలు, యేసుక్రీస్తు, పౌలు వంటి ఆదర్శవంతమైన జీవితాలు దేవుని సేవంటే ఏమిటో చక్కగా వివరించాయి. దేవుని మనసు, ఉద్దేశం, దర్శనం అర్థం చేసుకొని, ఆయన పిలుపుకు లోబడి (మత్తయి 28:20) సంతోషంగా, ఉత్సాహంగా, లక్ష్యసాధన దిశగా దేవుని పనిని చేయడం. అలా చేయడంలో, కొనసాగించడంలో, కొన్ని సవాళ్ళను, సమస్యల



ను, ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని వారి జీవితాలు చూపించాయి.

### పరిచర్యకు స్ఫూర్తి ప్రభువే

తండ్రి చిత్తం చేయడమే జీవిత పరమావధిగా పెట్టుకున్న యేసుప్రభువు $3^{1/2}$ సంవత్సరాల సేవా ప్రయాణం సాఫీగా జరగలేదు. ఏదో రూపంలో అడుగడుగునా ఆటంకాలు, సవాళ్ళు, వ్యతిరేకత, విమర్శలు, అవమానాలు, దుర్భాషలు, అపార్థాలు, చంపాలనే ప్రయత్నాలతోనే ఆయన పరిచర్య జీవితం ఈ భూమిపై అంతం వరకు కొనసాగింది. అయినప్పటికీ, ఆయన చలించిపోవడం, క్రుంగిపోవడం, నిరాశకు లోనవడం, ప్రతిచర్యలు చూపడం వంటివి ఏ కోశానా ఆయన జీవితంలో చూడము. ఆయనెవరో, ఎక్కడ నుంచి వచ్చాడో, వచ్చిన ఉద్దేశమేంటో, అంతిమంగా ఎక్కడికి వెళతాడో ఆయనకు తెలుసు. తండ్రి తన చేతికి సమస్తం అప్పగించెననియు, తాను దేవుని యొద్ద నుండి బయలుదేరి వచ్చెననియు, దేవునివద్దకు వెళ్ళవలసియున్నదని యెరిగాడు (యోహాను 13:3). ఇదే ఆయనకు స్ఫూర్తి, పురికొల్పు. అందుకే ఆయనను వెంబడించి, ఆయనలా జీవించాలి. ఆయనలా సేవ చేయాలంటే ప్రాణాన్ని కూడా లెక్క చేయనంతగా సిద్ధపడాలని ఖచ్చితంగా చెప్పాడే గాని జీవితాన్ని పూలపాన్పులా మార్చుకోమని సలహా ఇవ్వలేదు. దీనికి ఎవ్వరూ మినహాయింపు కాదు.

### యుఇయస్ఐ పరిచర్య

సహవాసానికి, స్వచ్ఛమైన ప్రేమకు, వ్యక్తిగత శ్రద్ధకు,

స్పష్టమైన దర్శనానికి మారుపేరుగా కొనసాగుతున్న యుఇయస్ఐ పరిచర్యకు ఇది సాధారణ విషయమే. యుఇయస్ఐ దేవుని అద్భుత ప్రణాళిక ప్రకారం ఆరంభించిన సంస్థ, సహవాసం, పెద్ద కుటుంబం. నశించిపోతున్న విద్యార్థుల పట్ల స్పష్టమైన దర్శనం, అభిలాష, తీవ్రతతో, ముందుకు కొనసాగుతున్న మహోద్యమం. పరిచర్య చేయాలనుకొనే వారికి ఇదొక సేవాకేంద్రం. సంస్థ నిర్మాణాలు, ప్రాజెక్టుల కంటే వ్యక్తుల జీవిత నిర్మాణమే అతిప్రాముఖ్యమని ఆదర్శవాదులుగా జీవించి, దైవభక్తి వారసత్వాన్ని వదలి వెళ్ళిన పూర్వికుల హార్ట్‌బీట్ ఇది. స్టూడెంట్ దశ నుంచి ఆధ్యాత్మికంగా గ్రాడ్యుయేట్స్‌గా ఎదిగిన వారు, గ్రాడ్యుయేట్స్‌గా పరిచర్యకు పరిచయమైన వారు, గ్రాడ్యుయేట్ దశ నుంచి స్టాఫ్‌గా కొనసాగేవారి కలయిక బృందం ఇది.

ఏ నేపథ్యం నుంచి వచ్చినా పరిచర్యలో ఉత్సాహంగా, చురుకుగా, సమర్పణతో చేయాలనుకునే అభిలాష కలిగిన వారి శాతం ఎక్కువే.

## పరిచర్యలో సమస్యలు

ఒక పక్క దేవుడు ఈ పరిచర్యను అత్యధికంగా ఆశీర్వదిస్తుంటే, మరొక ప్రక్క వ్యక్తిగతంగా, సహవాసంగా ఎదుర్కొంటున్న సవాళ్ళు, ఒత్తిళ్ళు, సమ-స్యలూ అంతే మోతాదులో అధికమవుతున్నాయి.

ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులు, ఉత్సాహంపై నీరు పోసి నిరుత్సాహాన్ని ప్రతిఫలంగా ఇస్తుంటాయి. తమ ఆలోచనలకు పొందవలసిన పురికొల్పు పొందక పోవడం, ఆశించినరీతిలో పరిచర్యలో పాల్గొని, బాధ్యతలు చేపట్టే అవకాశాలు రాకపోవడం, చేస్తున్న వ్యక్తిగత పరిచర్యను తప్పు పట్టడం, తమ భావాలను అపార్థం చేసుకోవడం వంటి పరిస్థితులు పరిచర్య తీవ్రతకు అడ్డుకట్ట వేస్తుంటాయి. అంతమాత్రాన దేవుడు పిలిచిన పిలుపును పక్కనపెట్టి, సహవాసానికి దూరమై పరిచర్యను వదలిపెట్టడం పరిష్కారం కాదు. అలా అనుకొంటే మొదటి శతాబ్దంలో పౌలు ఒక్క సంఘాన్ని కూడా స్థాపించేవాడు కాదు.

## సమస్యలలో పౌలు చూపిన మాదిరి

“పౌలు ప్రభువును నమ్ముకున్న దినాన్నుంచి అన్నీ సమస్యలే. ఒక పక్క ఆరోగ్య సమస్యలు, సంఘాల్లో సమస్యలు, వ్యక్తిగత దాడి (కొరింథులో), ప్రాణాలకు హాని, బహిరంగంగా అవమానపరిచే సందర్భాలు, ఎన్నో..మరెన్నో. ఏదీ తనను పరిచర్యలో నుంచి వెనక్కి లాగలేక పోయింది. తన జీవితం దేవునికి చెందినదని, పరిచర్య దేవునిదనే విశాల దృక్పథం, ఆధ్యాత్మిక పరిపక్వత తనను ముందుకు తీసుకొని వెళ్ళింది. “నేను ప్రభువైన యేసు వలన పొందిన పరిచర్యను, తుదముట్టింపవలెనని నా ప్రాణము నాకెంతమాత్రము ప్రియమైనదిగా ఎంచుకొనుట లేదు” అంటాడు (అ.కా. 20:24).

## సమస్యలకన్నా సహవాసం ప్రాముఖ్యం

సమస్యలనేవి పరిచర్యకు, ఉద్యమానికి సంబంధించినవి. మనలో కొందరు ప్రతిదానిని వ్యక్తిగతంగా ఆరోపిస్తారు. సంస్థాపరంగా ఉండే నియమాలు, నిబంధనల దృక్కోణంలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ప్రతి చిన్న విషయానికి సున్నితంగా స్పందించడం మానుకుంటాం. మనం సహవాసంలో ఇమిడి పోవాలి, సహవాసంతో పాటు ముందుకు కొనసాగితే అప్పుడు దేవుడు మనకిచ్చిన దర్శనాన్ని భావితరానికి ఆశావాదులంగా అందించడానికి వీలవుతుంది.

“అంతర్గత వివాదం కేవలం మన మీద ప్రభావం చూపి, మన మనశ్శాంతిని పాడుచేయడమే కాదు, అంతిమంగా ఇతరులతో మనకున్న సంబంధాలను చెడగొడుతుంది” అని బోయస్ హగ్గట్ అంటారు.

## ముగింపు

బంగారం, వెండి, వెలగల రాళ్ళు, ఈ పదార్థాలను అత్యుత్తమ భవన నిర్మాణంలో వాడుకొంటారు. ఎంత ఖర్చయినా వెనుకాడరు, ఎంత ప్రయాసైనా వెచ్చించడానికి ఇష్టపడతారు. అగ్ని వీటిని ఏవిధంగాను నాశనం చేయలేదు. పైగా అది వాటిలోని మలినాన్ని తీసివేసి స్వచ్ఛమైన వాటిగా చేస్తుంది.

దేవునిని సంతోషపరచడం కోసం పరిచర్యకు మనం శ్రేష్ఠమైన వాటినిస్తాం, ఉత్తమమైన రీతిలో పనిచేస్తాం. మనం నమ్మకంగా, స్వచ్ఛమైన దృక్పథాలతో పరిచర్య చేస్తే పరలోకంలో దేవుడు మనలను ఘనపరుస్తాడు.

దేవునికి మనం చేసే సేవా వైఖరిని పరీక్షించుకుందాం, సంతోషంగా సేవ చేద్దాం.

– **బి. మంజుల లాజరస్,** హైదరాబాద్

ప్రత్యేకం

# ఔట్‌గోయింగ్ విద్యార్థులు ప్రభువులో, పరిచర్యలో కొనసాగాలి



రాష్ట్రంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి ప్రాజెక్టులు కట్టి రాష్ట్రంలో వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి అసెంబ్లీలో తెలియజేశారు. అందుకు తగ్గట్లు ప్రణాళికలు కలిగి బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు నీటిని వ్యర్థం కాకుండా సరిగా ఉపయోగించుకొని అభివృద్ధిని చూడాలని ప్రణాళిక కలిగి పని చేస్తుంటే, మనం ఒక క్రైస్తవ ఆర్గనైజేషన్‌గా విద్యార్థులకు సువార్తను ప్రకటించి వారిని శిష్యులుగా తీర్చిదిద్దుతూ సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసే నాయకులుగా తీర్చిదిద్దే పనిలో ఉన్నాము.

కళాశాల నుంచి విద్య ముగించుకొని బయటకు వచ్చే ఔట్‌గోయింగ్ విద్యార్థులను పట్టించుకొని దర్శనం కలిగిన గ్రాడ్యుయేట్స్‌గా పరిచర్యలో కొనసాగే విధంగా చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. తద్వారా అన్‌రీచ్డ్ కళాశాలలను, ప్రాంతాలను త్వరగా క్రీస్తు ప్రభువు కొరకు గెలుచుకోగలం. వారు ఎక్కడ ఉన్నా ప్రభావవంతమైన యేసుక్రీస్తు శిష్యులుగా జీవించగలరు.

ఏపిఎం-2022 రిపోర్ట్స్ ప్రకారం కేవలం 17% ఔట్‌గోయింగ్ విద్యార్థులు మాత్రమే పరిచర్యలో కొనసాగుచున్నారని, మరికొంతమంది చర్చ్‌లో మాత్రమే ప్రభావవంతంగా ఉన్నారనేది వాస్తవం. మిగిలిన వారిలో కొందరు విశ్వాస జీవితంలో వెనుకబడిపోవడం, నిరుద్యోగ సమస్య, అవిశ్వాసులైన వారిని వివాహం చేసుకోవడం, ఉద్యోగ ఒత్తిడి అనే కారణాలతో విశ్వాసంలో కొనసాగలేకపోవడం వల్ల యుఇయస్‌ఐ పరిచర్యలో పాల్గొనలేకపోవుచున్నారు.

ఇలా జరగడానికి కారణాలు ఏంటంటే, విద్యార్థులు చదువుకొనే సమయంలో విశ్వాస సంబంధమైన విషయాలలో నిర్లక్ష్యం వహించడం, నేర్చుకొన్న విశ్వాస సత్యాలను అనుదిన జీవితంలో అనుసరించకపోవడం, ప్రభువు ఇచ్చిన దర్శనాన్ని అందుకోవడంలో మందులుగా ఉండడం, విశ్వాస విద్యార్థులుగా ఉన్నప్పుడు పరిచర్యలో చురుకుగా పాల్గొనలేకపోవడం, భవిష్యత్ పట్ల సరైన గురి లేకపోవడం, చదువును నిర్లక్ష్యపెట్టడం. వీరు విద్యార్థులుగా ఉన్నప్పుడు గ్రాడ్యుయేట్స్ సరైన విధంగా మెంటర్ చేయలేకపోవడం అంటే విశ్వాస విషయంలో సరిగా గైడ్ చేయకపోవడం, యంపిసిలలో వారితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఉద్యోగ, వివాహ విషయాలలో సరైన అవగాహన కల్పించకపోవడం, చదువు ముగించుకొని వెళ్ళిన తర్వాత వారిని గూర్చిన శ్రద్ధ తీసుకోకపోవడం లాంటివి కూడా వారు పరిచర్యలో కొనసాగలేకపోవడానికి కారణాలు. కాబట్టి వీటిని అధిగమించి ముందుకు సాగాలి. ఈ విషయంలో ఔట్‌గోయింగ్ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, ఇజియఫ్ కమిటీలు ఏమి చేయాలనే విషయాలను తెలుసుకొందాం.

### ఔట్‌గోయింగ్ విద్యార్థుల పాత్ర

- మెంటర్‌తో కమ్యూనికేషన్‌లో ఉండాలి.
- కుటుంబ నేపథ్యాన్ని బట్టి వివాహ విషయంలో ఓపెన్‌గా అన్ని విషయాలు మెంటర్‌తో షేర్ చేయాలి.
- వివాహం, ఉద్యోగం విషయంలో తన ప్రణాళికను, వైఖరిని ముందుగానే మెంటర్‌కు తెలియచేయాలి.
- ఎక్కడ ఉన్నా ప్రభువుకు నమ్మకంగా జీవించాలనే గురి కలిగి ఉండాలి.
- ఆత్మీయ విషయాల్లో తీవ్రత కలిగి యుండాలి.
- విద్యార్థి పరిచర్య పట్ల తన గురి, దర్శనం, పాల్గొనే విషయంలో ఎలా ఉండాలో నిశ్చయించుకోవాలి.
- ఈ విషయంలో ఆత్మీయులైన పెద్దల సలహాలను తీసుకోవాలి.
- మన జీవితాలకు మనమే బాధ్యులమని,

ప్రభువుకు లెక్క అప్పజెప్పాలని తెలుసుకోవాలి.

- ❖ మన వైఫల్యాలకు వేరే వారు బాధ్యులనే వైఖరి ఉండకూడదు.
- ❖ వ్యతిరేకతలో, ఆటంకాలలో ప్రభువు కొరకు నిలబడాలి. వ్యతిరేకతలో విశ్వాసంలో నిలబడిన జోసెఫ్, ఇశ్రాయేలు చిన్నది, దానియేలు లాంటి వారిని బైబిలులో మనం చూడగలం. వీరిని మన జీవితాలకు మాదిరిగా తీసుకుందాం.
- ❖ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభువు మీద ఆధారపడుతూ సహవాసం యొక్క సహాయం తీసుకోవాలి.
- ❖ సహవాసంలో కొనసాగడానికి మనమే చొరవ తీసుకోవాలి.
- ❖ మనం ఏ ప్రాంతంలో ఉన్నామో అక్కడ పరిచర్య ఉందా లేదా అని తెలుసుకొని, అక్కడ సహవాసంలో పాల్గొనాలి. లేకపోతే దగ్గరలోని ఇయు, ఇజియఫ్ సహాయంతో పరిచర్యను ప్రారంభించాలి.

## గ్రాడ్యుయేట్స్ పాత్ర

- ❖ ఔట్‌గోయింగ్ విద్యార్థికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలి.
- ❖ క్యాంపస్ విడిచి వెళ్ళడానికి ముందే వారి విషయాలు తెలుసుకొని సలహాలు ఇవ్వాలి. వారి పూర్తి వివరాలు సొంత ఊరు అడ్రస్ తెలుసుకోవాలి.
- ❖ వారి కెరియర్, వివాహ విషయంలో సలహాలు ఇస్తూ వారితో కలిసి ప్రార్థించాలి.
- ❖ వారు ఎక్కడికి వెళ్తున్నారో, ఎక్కడ ఉన్నారో తెలుసుకొని దగ్గరలోని ఇజియఫ్‌కు అటాచ్ చెయ్యాలి. అక్కడ ఉన్న గ్రాడ్యుయేట్స్‌తో మాట్లాడి వారికి అప్పగించి ఫాలోఅప్ చేయాలి.
- ❖ వారితో కనీసం ఒక్కసారైనా ఫోన్‌లో మాట్లాడుతూ ఉండాలి.
- ❖ కొత్త ప్రదేశంలో వారు ఎదుర్కొనే సమస్యలు, శోధనలను తెలుసుకొని వారిని ధైర్యపరుస్తూ, ప్రోత్సహించాలి.
- ❖ ఎప్పుడైనా వారు వెనుకబడిన స్థితిలో ఉన్నారని తెలిస్తే, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనుపరచి వారిని బలపరచాలి.
- ❖ వారు స్థిరపడేవరకు వారితో కలిసి ప్రార్థించాలి.

## ఇజియఫ్ కమిటీ పాత్ర

- ❖ ప్రతి సంవత్సరం ఔట్‌గోయింగ్ విద్యార్థులకు వన్‌డే రిట్రీట్ ఏర్పాటు చేసి ఏపి-ఇజియఫ్‌చే నిర్ణయించబడిన సిలబస్ ప్రకారం టాక్స్ పెట్టాలి. వారికి వివాహం, ఉద్యోగం, పరిచర్యలో దైవ చిత్తం కనుగొని, విధేయత చూపడం లాంటి విషయాలు బోధించాలి. సరైన రిసోర్స్ పర్సన్స్‌ని ఏర్పాటు చెయ్యాలి.
- ❖ ఇజియఫ్ కమిటీలో ఔట్‌గోయింగ్ విద్యార్థుల బాధ్యత కొరకు ఒక మెంబర్‌ని ఉంచాలి. ప్రతి ఇజియఫ్ కమిటీలో వీరి గురించి చర్చించాలి.
- ❖ ప్రతి సంవత్సరం వెళ్ళబోయేవిద్యార్థుల లిస్ట్‌ను ముందుగానే సేకరించి వారిని మెంటర్‌కి అప్పగించాలి.
- ❖ చివరి సెమిస్టర్ (బి.టెక్, పి.జి) లోనే వారిని ఇజియఫ్‌కు ఆహ్వానించాలి. తద్వారా వారిలో ఉన్న కొత్తదనం, భయం, అపోహలు పోయి ఇజియఫ్‌కి త్వరగా అటాచ్ అయ్యే అవకాశం ఉంది.
- ❖ వివాహం, విశ్వాస విషయాల్లో ఏదైనా క్లిష్టమైన పరిస్థితులు వారు ఎదుర్కొంటూ ఉంటే ఇజియఫ్ వారికి అండగా నిలబడాలి.

ఇలాంటి సూచనలు, సలహాలు మనకు ఎన్ని తెలిసినా వారి పట్ల ప్రేమ, భారంతో కూడిన హృదయం చాలా ప్రాముఖ్యమైనది. యేసుక్రీస్తు కూడా తన శిష్యుల పట్ల ఇలాంటి ప్రేమను చూపించాడు (యోహాను 21:1-14). వ్యక్తులు, అవసరతలు, నడిపించే విధానం మారిపోవచ్చు కాని ఆత్మ దేవుని నడిపింపులో మనము ఈ పనిని ఫలవంతంగా చేయగలము.

ఔట్‌గోయింగ్ విద్యార్థులు కూడా యోసేపు వలె ఐగుప్తులో ఒంటరిగా ఉన్నా దేవునియందు భయంతో జీవించేట్లు, దానియేలు వాని స్నేహితులు బబులోనులో పవిత్రంగా జీవించి సాక్షులుగా ఉన్నట్లు, ఇశ్రాయేలు చిన్నది సిరియా దేశంలో ప్రభావవంతంగా జీవించినట్లు ఎక్కడ ఉన్నా దేవుని మహిమార్థం జీవించాలి.

– **ఆర్. రాజ్‌కుమార్,** స్టాఫ్, తిరుపతి


(ఏపి-ఇజియఫ్ తరుపున)

# యేసు

## నీకెలా అర్థమయ్యాడు?

యేసుప్రభువు అనే పేరు వినపడగానే మన కళ్ళ ఎదుట గుర్తొచ్చే దృశ్యం మూడు మేకులతో సిలువకు కొట్టబడి, ముళ్ళ కిరీటం పెట్టబడి, దేహమంతా రక్తంతో, నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక వ్యక్తి. ఇలాంటి యేసుప్రభువు చిత్రాలను చూసినప్పుడు ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఆలోచిస్తుంటారు. కొంతమంది 'అయ్యో పాపం' అని జాలిపడతారు. మరికొందరు యేసుప్రభు యొక్క త్యాగం, ప్రేమ గొప్పవని మెచ్చుకుంటారు. మరికొందరు శత్రువుల కొరడా దెబ్బలను మౌనంగా భరించి ఎంతో గొప్పగా క్షమించాడని పొగుడుతారు. మరికొందరు ఈయన దేవుడు, ప్రభువు కదా మరెందుకు ఈ దుస్థితి పట్టింది అనే సందేహాన్ని వెళ్లబుచ్చుతారు? నీకు కూడా యేసుప్రభువు గురించి ఆలోచించినప్పుడు ఇలాంటి ఏదో ఒక ఆలోచన వచ్చే ఉంటుంది కదూ!

ప్రస్తుత సమాజంలో కూడా యేసుప్రభువు గూర్చి అనేకమైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొంతమంది ఆయనను అర్థం చేసుకొని వాళ్ళ జీవితాలను అర్థవంతంగా మార్చుకొని బతుకుచున్నారు. మరికొందరు అపార్థం చేసుకొని, అర్థంలేని వాఖ్యానాలు చేస్తున్నారు. యేసుక్రీస్తుతో పాటు సిలువ వేయబడిన నేరస్థులలో (దొంగలు) కూడా ఆయనను ఒకడు అర్థం చేసుకున్నాడు. మరొకడు అపార్థం చేసుకున్నాడు. వారు ఆయన పట్ల కలిగి ఉన్న వైఖరి, అవగాహన వారి గమ్యాలను మార్చివేసింది. ఇద్దరూ నేరస్థులే, సమాన శిక్ష పొందుచున్న వాళ్ళే కానీ పక్కనే ఉన్న లోక రక్షకుని అర్థం చేసుకొని సిలువ వేయబడిన క్రీస్తుకు వారు స్పందించిన విధానమే వాళ్ళ గమ్యం మార్చింది.



ఒకడు సిలువలో వేలాడుతున్న యేసుతో "నిన్ను నువ్వు రక్షించుకో మమ్మల్ని రక్షించు" అని ఎగతాళి చేస్తూ దూషించాడు. ఈ మాటలలో తన వైఖరిని మనం అర్థం చేసుకోవచ్చు. ఆయనను ప్రభువు, దేవుడు, పాప రహితుడని గుర్తించక తనతో సమానం చేసుకొని తాత్కాలిక రక్షణ కోరుకొన్నాడు. ఈనాడు చాలామంది ఈ మొదటి దొంగలాగే తాత్కాలిక సంతోషాల కోసం, సంపద కోసం, ఆరోగ్యం కోసం, ఆశీర్వాదాల కోసం యేసు వైపు చూస్తూ నిరుత్సాహపడుతున్నారు. ఆయనని ఏకైక దేవునిగా, పాపం నుంచి రక్షించే వానిగా గుర్తించలేకపోతున్నారు. ఈ మొదటి దొంగ ఎలాగైతే తను ఒక పాపి అని స్పృహ లేకుండా ఉన్నాడో చాలామంది వాళ్ళు పాపులు, శిక్షకు అర్హులమని గుర్తించలేకపోతున్నారు. కొంతమంది ఆయనను సరిగా అర్థం చేసుకోక కించపరుస్తూ అసహ్యించుకొంటున్నారు.

అయితే రెండవ నేరస్థుడు తన పక్కన ఉన్న పరమ రక్షకుణ్ణి సరిగా అర్థం చేసుకొన్నాడు. మొదటి వానిని గద్దిస్తూ "ఈ శిక్ష మనకు తగినది ఆయనకు కాదు" అనడంలో తను ఒక పాపి అని శిక్షకు అర్హుడని గుర్తించాడు. ఆయన ఏ తప్పు చేయలేదని శిక్షకు అర్హుడు కాదని గ్రహించాడు. మొదటి దొంగని గద్దించడంలో తనకు యేసు ప్రభువు పట్ల ఉన్న ప్రేమ, గౌరవం మనం గమనించగలం. ఆ రెండవ

దొంగ యేసుప్రభువు వైపు తిరిగి "నీ రాజ్యంలో నన్ను కూడా జ్ఞాపకం చేసుకో" అని ఎంతో తగ్గింపుతో యేసుప్రభువుని అడిగాడు. రెండో దొంగ పలికిన ఈ రెండో మాటలో తను యేసుప్రభువుని రాజుగా, రక్షకునిగా, దేవునిగా గ్రహించి ఆయన రాజ్యం రాబోతుందని, అది నిరంతరమైనదని, యేసుప్రభువే అందులోకి చేర్చగలడని విశ్వసించి విన్నవించుకొన్నాడు. ఈ విశ్వాసమే ఆ రెండవ నేరస్తుని యొక్క అంతాన్ని అద్భుతంగా మార్చింది. ఆ విశ్వాసాన్ని చూసిన యేసయ్య ప్రేమతో నిశ్చయంగా నీవు నాతో ఉంటావని అభయాన్ని ఇచ్చాడు. ఇలా ఆ ఇద్దరి నేరస్థుల యొక్క గమ్యం మారిపోయింది.

సిలువ వేయబడిన యేసుక్రీస్తును చూస్తున్న నీవు ఎలా అర్థం చేసుకొంటున్నావు? ఆయన చేతకాక మరణించలేదని అనేకుల పాప విమోచన కోసం క్రయధనంగా తన ప్రాణాన్ని సిలువలో త్యాగం చేశాడని గ్రహిస్తున్నావా? అది నీ పాప విమోచన కోసమే. నిన్ను నిత్య రాజ్యంలో చేర్చడం కోసమే. "ప్రపంచంలో అందరూ జీవించి మరణిస్తారు కానీ చరిత్రలో యేసుప్రభువు మాత్రమే మరణించి జీవిస్తున్నాడు" అని జాన్ స్టాట్ అనే భక్తుడు అంటాడు. యేసుప్రభువు స్వచ్ఛందంగా సిలువలో మరణించి మూడవ దినాన సమాధిని గెలిచి తిరిగి లేచాడు. ఎంతోమంది మహానుభావుల జీవితం సమాధితో ముగించబడింది కానీ యేసుప్రభువు సమాధిని జయించి శిక్షకు, మరణానికి పాత్రులైన మనుషులను అట్టి మరణం నుంచి లేపడానికి సమర్థుడు. "అందరూ పాపం చేసి నిత్య శిక్షకు అర్హులు అయ్యారు" అని బైబిల్ చెబుతుంది. నీవును పాపంతో పట్టబడి నిత్య శిక్షకులోనై ఉన్నావు. యేసుప్రభువుని అర్థం చేసుకొని విశ్వసించి నిత్యజీవాన్ని కోరుకుంటావో లేక అపార్థం చేసుకొని నిత్య నాశనాన్ని కోరుకుంటావో నిర్ణయం నీదే! గమ్యం నీదే! యేసుప్రభువు చనిపోయినప్పుడు మబ్బులు కమ్మి, దేవాలయపు అడ్డతెర రెండుగా చిరిగింది. ఆయన త్యాగపూరితపు సిలువ ప్రేమ ఎదుట అక్కడ బండలు సహితం బద్దలయ్యాయి. ఈనాడు ఆ త్యాగపూరిత సిలువ ప్రేమ ఎదుట నీ హృదయాన్ని ఆయన కోసం తెరుస్తావో లేక కఠిన పరచుకొంటావో నీ ఇష్టం!


**– ఎ. శివరామకృష్ణ,** స్టాఫ్, పిడుగురాళ్ళ

# పిచ్చి కాగితం

అనిల్ త్వరగా నిద్ర లేచాడు. అమ్మ లేపకుండానే నిద్ర లేచాడు. ఎందుకంటే ఈరోజు కొత్తగా హాస్టల్‌లో జాయిన్ అవ్వాల్సి ఉంది. చాలా ఉత్సాహంతో ఉన్నాడు. ఆ సమయం రానే వచ్చింది. అమ్మ, అనిల్‌ని జాయిన్ చేయడానికి వచ్చింది. ఇద్దరూ హాస్టల్ గేట్ దగ్గర నిలబడ్డారు. అనిల్‌కి ఏదో తెలియని ఉత్సాహం. ఇన్నాళ్ళు పంజరంలో చిలకలా బతికిన తనకు ఒక్కసారిగా ఏదో తెలియని స్వేచ్ఛ వచ్చినట్లయింది.

అమ్మ హాస్టల్లో జాయిన్ చేసి వెళ్ళిపోయింది. ఒక్కసారిగా అనిల్‌కి కొత్త ప్రపంచం కనబడింది. మొదటి గుంపు సీనియర్ అన్న వాళ్ళది. వారి జోక్స్, డైలాగ్స్, పంచ్‌లు, సెల్ ఫోన్స్, ఆటలు, పాటలు, సంబరాలు ఒకటేమిటి..

మరో గుంపు విశ్వాసుల గుంపు. ఏ గుంపులో చేరాలోనని డైలమాలోపడ్డాడు అనిల్. అయితే మొదటి గుంపులోనే జాయిన్ అయ్యాడు. కాలం గడుస్తూ ఉండగా అనిల్ ఏవైతే నేర్చుకోకూడదో అవన్నీ నేర్చుకొన్నాడు మొదటి గుంపుతో. తెల్ల కాగితంలా ఉన్న అతని మనసు పిచ్చి కాగితంలా మారిపోయింది. మలినమైన మరకలు, గీతలు ఎన్నో. తన ఆశలు, ఆపేక్షలు అర్థంలేనివని తెలుసుకోడానికి ఎంతోసమయం పట్టలేదు. కళ్ళముందే తన విలువైన జీవితం వికారంగా మారడాన్ని తట్టుకోలేకపోతున్నాడు.



అనిల్ విచారంతో రూమ్‌లో ఒంటరిగా ఉన్నాడు. ఏదో ఒక స్వరము 'తమ్ముడు' అని పిలవడం విన్నాడు. అప్పటివరకు ఏరా, ఒరే, పోరా, మామ, మచ్చ అన్న మాటలే విన్నాడు. ఎందుకనో ఈసారి తమ్ముడూ అనగానే రెస్పాండ్ అయ్యాడు. ఎవరా! అని ఆతురతతో తలుపు తీసాడు. అతనెవరో కాదు, రెండవ గ్రూపుకు చెందిన అన్న. తమ్ముడూ, పదా డాబా పైకి వెళ్దాం అన్నాడు. అన్నతో అయిష్టంగానే మెట్లు ఎక్కాడు. యేసుక్రీస్తు మాటలు వింటూ విచారాన్ని మర్చిపోయాడు. మనసుకు ఎడారిలో నీటి ఊటలా అన్పించింది. పిచ్చి కాగితంలా ఉన్న తన జీవితాన్ని తెల్ల కాగితంలా మారుస్తానన్న యేసుకు తన హృదయాన్ని ఇచ్చాడు.

**– రవికిషోర్,** భీమడోలు
(రైటర్స్ వర్క్‌షాప్ స్ఫూర్తితో)

**నాయకులకు**

# మీరెన్నాళ్ళు తడవు చేస్తారు?

## అందని ప్రాంతాల్ని అందుకుందాం, ప్రభువు కోసం పొందుకుందాం.

*"మీరు వెళ్ళి నేను మీకిచ్చిన దేశమును స్వాధీన పరచుకోండి" – ద్వితీ 9:23*

ప్రభువు మనకు రాష్ట్రంలోని కళాశాలలన్నిటినీ ఇచ్చేశారు. స్వాధీనం చేసుకుందాం పదండి! వచ్చే సంవత్సరాలలో ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ కమిటీ ఏర్పడుతుందని, రాయలసీమ పుష్పిస్తుందని నమ్ముతున్నారా? అని సత్యీర్తిరావు, పిసి వర్గీస్‌గార్ల ద్వారా దేవుడు మాట్లాడుతుంటే ఎంత ఆనందం వేసిందో! అప్పటికి పదిజిల్లాల్లో డిస్ట్రిక్ట్ కమిటీల్లేవు. రాయలసీమలో 5,6 కేంద్రాల్లోనే పరిచర్య జరుగుతుంది.


అది మొన్న 1985లో జరిగిన మొదటి ట్రైకాన్‌లో దేవుడు మనకిచ్చిన వాగ్దానం. 38 ఏళ్ళవుతుంది.

రాష్ట్రంలో 700పైగా ఉన్న కళాశాల కేంద్రాల్లో కొన్నిటిని మాత్రమే స్వాధీనం చేసుకోగలిగాం. మనకి మనసు లేదో తీరిక లేదో గాని చాలా ఆలస్యం జరిగింది.

*'మీ దేవుడైన యెహోవా మీ కిచ్చిన దేశమును స్వాధీన పరచుకొన వెళ్ళకుండ మీరెన్నాళ్ళు తడవు చేసెదరు?' యెహోషువ 18:3*

ఇది 2017 జనవరిలో జరిగిన ట్రైకాన్‌లో దేవుడు మనల్ని అడిగిన ప్రశ్న ఇది. (తడవు = అలక్ష్యంతో కూడిన ఆలస్యం, నత్తనడక).

ఆ ప్రశ్నకు ప్రభువు ఆశించిన రీతిలో మన జవాబుగా 2018 జనవరిలో 'స్టే అండ్ సౌండ్ ద గాస్పల్' ప్రోగ్రామ్ జరిగింది.



2000సం॥లో నూతన సహస్రాబ్దిలో అడుగుపెట్టే క్రమంలో మన రాష్ట్రంలోని ప్రతి కళాశాల కేంద్రం కోసం ప్రార్థించేలా, వాటిని మైక్రో ప్రేయర్ సెల్స్‌కు పంచడం జరిగింది. 2018 జనవరిలో జరిగిన 'స్టే అండ్ సౌండ్ ద గాస్పల్' ప్రోగ్రామ్‌లో అయితే అన్ని కేంద్రాల్ని స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్‌తో కూడిన బృందాలు దర్శించి, అక్కడే మూడు రోజులు ఉండి, అన్ని కళాశాలల్లో అడుగుపెట్టి ప్రార్థించి, అక్కడి సంఘకాపరులతో, పెద్దలతో, తల్లిదండ్రులతో ఓ మీటింగ్ పెట్టుకొని మన పరిచర్య గురించి వారికి తెలియజేసి, వారందరి సహకారంతో ఓ చిన్న గాస్పల్ మీటింగ్ పెట్టి, కొందరిని ప్రభువు కొరకు సంపాదించుకొని, మంచి కాంటాక్ట్స్‌తో వచ్చాము. ఇప్పుడా కాంటాక్ట్స్ పరిస్థితి ఏమిటి? ఎన్ని ప్రదేశాల్ని రీచ్ అయ్యాము? ఇంకా రీచ్ కాని ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి కదా? వాటి పరిస్థితేంటి? వాటిని చేరుకొనే విషయంలో ఇంకా తడవెందుకు చేస్తున్నాం.

అన్‌రీచ్డ్ సెంటర్స్‌ను బైబిల్ పరిభాషలో 'క్రీస్తు నామమెరుగని చోట్లు, బీడు భూములు' అంటాం.

**స్వాధీనం చేసుకోవడానికి షరతులు:** (సంఖ్యా 14:8,9)

**1. దేవుని ఆనందం (8వ)** – దేవుడు మనయందు ఆనందిస్తేనే అది సాధ్యం. మన ప్రభువు మన జీవితాల్ని చూసి ఆనందిస్తున్నాడా?

**2. దేవుని సన్నిధి (9వ)** – దేవుడు మనకు తోడుంటేనే అది సాధ్యం. ఆయన సన్నిధి అనుక్షణం అనుభవించాలి. ఆయన మీదే పూర్తిగా ఆధారపడాలి.

**3. దేవునికి విధేయత (9వ)** – దేవునిపై తిరగబడకుండా విధేయత చూపిస్తేనే అది సాధ్యం (యిర్మీయా 4:4). అవి మన బీడు భూములట. మనమే వాటిని దున్నాలట. దున్నడానికి ముందు ఆయనకు విధేయత చూపించాలట. సాగు చేస్తున్న భూమిలో పంట పండించడంతో పోలిస్తే, బీడు భూముల్ని వ్యవసాయ యోగ్యంగా తీర్చిదిద్ది పంట పండించడం చాలా కష్టం. కానీ అలా పండిస్తే ఉండే ఆనందమే వేరు. అది అనుభవించినవాళ్ళకే తెలుస్తుంది. స్వాధీనపరచుకొమ్మన్నదాన్ని స్వాధీనపరచుకోకపోవడం అవిధేయత మాత్రమే కాదు. తిరుగుబాటు క్రింద లెక్క. అన్నింటిలో ఆయన మాటకు ఆయన ఆశించినంత విధేయత చూపించాలి.

**ఇప్పటి వరకూ స్వాధీనపరచుకోలేకపోవడానికి కారణాలు:** (యెహోషువ 17:11-18).

1. ప్రస్తుత పరిస్థితితో సంతృప్తి పడడం.
2. తమ దేవుని శక్తి సామర్థ్యాల్ని మరచిపోవడం. శత్రువు బలాల మీద దృష్టిపెట్టడం.

మనమూ అంతే. జరుగుచున్న కొద్దిపాటి పరిచర్యను చూసుకొని మురిసిపోతుంటాం. మన జబ్బులు మనమే చరచుకుంటూ ఉంటాం. కళాశాలల్లోని కొద్దిపాటి అననుకూలత / ప్రతికూలతలను భూతద్దంలో పెట్టి చూసుకొని చేతులు కట్టుకొని కూర్చుంటున్నాం. 'కొంతమంది యువకులు పుట్టుకతోనే వృద్ధులు' అన్న మహా కవి శ్రీశ్రీ మాటలు మనలో చాలామంది విషయంలో వాస్తవం. ముఖ్యకారణం 'వెల చెల్లించడానికి ఇష్టపడకపోవడమే'.

**స్వాధీనపరచుకోవడానికి మార్గాలు**

1. దేవుడు మీకిచ్చిన శక్తి సామర్థ్యాల్ని గుర్తించండి. చెట్లు నరికి అరణ్య ప్రదేశాన్ని సొంతం చేసుకోండి (15వ)
2. మీరంతా ఐక్యతతో, కలసికట్టుగా శత్రువును పారద్రోలి దేవుడిచ్చినదంతా స్వాధీనం చేసుకోండి (17వ)

మీరు విస్తారమైన జనము. మీకు అధిక బలముంది. మీ భూభాగాన్ని మీరు విస్తరించుకోగలరు. ఆ కొండమీద అరణ్యాన్ని నరకండి. అప్పుడు అది మీదవుతుంది. అడ్డదారుల్లేవు. ఆ బీడు భూములు మీవే. మీరే దున్నాలి (యిర్మీయా 4:3). కొండలెక్కడం, చెట్లు నరకడం, బీడు భూములను దున్నడం ఓ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్!. 'నాకోసం ప్రాణం పెట్టిన ప్రభువుకోసం నేనేదైనా గొప్ప పని చెయ్యాలి. దాని కోసం ఎంత వెల అయినా చెల్లించాలి' అనే తపన, ఆరాటం ఉన్న వాళ్ళే ఆ పనులు చేయగలరు.

దేవుడు మనకిచ్చిన వనరుల్ని మనం పూర్తిగా వినియోగించుకోవడం లేదు. వివిధ తలాంతులు, వివేకం కలిగియుండి ఆయన మీద ఆధారపడే విశ్వాస విద్యార్థులు దాదాపు 2228 మంది, ఆయన చిత్తం జరిగించాలని కోరుకునే అంకితభావం గల గ్రాడ్యుయేట్లు 2825 పైగా ఉన్నారు. మన దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతటి గ్రాడ్యుయేట్ ఇన్వాల్వ్‌మెంట్ మన సొంతం. అయితే మనలో కొద్ది మందే



*“మీరు ఊరక ఉన్నారేమి?’ ‘*
*నేను విభిన్నంగా జీవించను.*
*నోరు తెరచి క్రీస్తును గూర్చి చెప్పను.*
*బైబిల్‌స్టడీ తీసుకోను.*
*బైబిల్‌స్టడీకి ఎవ్వరినీ తీసుకెళ్ళను.*
*పరిచర్యకు త్యాగపూరితంగా ఇవ్వను,*
*కానీ రాష్ట్రంలోని ప్రతి కళాశాల విద్యార్థికి సువార్త అందాలి.*
*ప్రతి కళాశాల కేంద్రంలో ఓ సాక్షిగుంపు ఏర్పడాలి”*
*అంటే ఎలా?*

పనిచేయడం, ఎక్కువమంది చోద్యం చూడడం, పనిచేసేవారిని విమర్శించడం ప్రధాన సమస్యలు.

### మనం స్వాధీనపరచుకోకపోతే - పరిణామాలు?

- వారే మనకు ఉరిగాను, బోనుగాను, కళ్ళల్లో ముళ్ళు గాను, ప్రక్కలో శూలాలుగాను అవుతారు (యెహో 23:13).
- నింద భరించాల్సి ఉంటుంది (నెహె 2:17)
- దేవునికి లెక్క అప్పచెప్పవలసి ఉంటుంది.

### దేవుని ఆకాంక్ష

అందరూ అంతటా సువార్త వినాలన్నది, అందరూ రక్షింపబడాలన్నది మన ప్రభువు ఆకాంక్ష. (2 పేతురు 3:9).

‘ప్రతి కళాశాల విద్యార్థికి సువార్త, ప్రతి కళాశాలలో ఓ సాక్షి గుంపు’ అన్నది మన నినాదం.

### పౌలు పరిచర్య పద్ధతులు

1. **ప్రార్థన:** ఇదిగో అతడు ప్రార్థన చేయుచున్నాడు (అపొ.కా. 9:11; రోమా 10:1); ప్రార్థన కోరుచున్నాడు (రోమా 15:32)
2. **పరిశుద్ధాత్మ నడిపింపు** – బితూనియ, మాసిదోనియ (అపొ.కా. 13:1; 16:7,9)
3. **కలిసి పరిచర్య** – పౌలు, బర్నబా, మార్కు, సీల, తిమోతి
4. **పట్టువదలని పరిచర్య** – ఎన్ని అవాంతరాలు, ఆటంకాలు, హింసలు ఎదురైనా
5. **తదనంతర పరిచర్య (ఫాలోఅప్)** – పత్రికల ద్వారా, వ్యక్తిగత సందర్శనల ద్వారా

తనకప్పగింపబడిన క్రీస్తునామమెరుగని చోట్లన్నింటిలో సువార్తను ప్రకటించాడు (రోమా 15:21). మరి మనం?

### మన పితరుల వైఖరి వారి పరిచర్య పద్ధతులు:

మద్రాసు, వెల్లూరు, కోయంబత్తూరు ఐసిఇయులు ఆరంభించడంలో విద్యార్థులదే ప్రముఖ పాత్ర అని మరచిపోవద్దు.

- వారు ఎక్కువగా దేవునిపై ఆధారపడేవాళ్ళు (Dependent on God)
- ప్రతి పనికీ దేవునిని సంప్రదించి, ఆయన చిత్తాన్ని తెలుసుకొని దానికి విధేయత చూపించేవాళ్ళు (Obedient to God’s will)
- మరెంతో త్యాగపూరితంగా, కార్యదీక్షతో, అంకితభావంతో, భారంతో పనిచేసేవాళ్ళు (Committed to God given task)
- వారు దేవుడు తమకిచ్చిన దర్శనం చేత నడిపింపబడ్డవాళ్ళు, ప్రభువు కోసం ఏదో సాధించాలనే ఆరాటంగలవాళ్ళు (Vision driven & Passion filled)

### పౌలు ఆపేక్ష

***‘మీలో ప్రతివాడు’*** – మీ నిరీక్షణ పరిపూర్ణం కావడం కోసం, మందులు కావద్దు. (సోమరితనానికి విశ్వాసి జీవితంలో స్థానం లేదు). ఆసక్తిని చివర వరకు కనుపరచండి. (ఆరంభశూరత్వం కాదు). విశ్వాసంతో, ఓర్పుతో, వాగ్దానాలను (ద్వితీ9:23) స్వతంత్రించుకొనేవారిని పోలి నడుచుకోండి (హెబ్రీ 6:11,12). ఇందులో ప్రతివాడు అన్న పదం ఎంతో ముఖ్యం. మనలో కొద్దిమంది

పనిచేయడం, ఎక్కువమంది చోద్యం చూడడం ప్రధాన సమస్య అని ఇంతకుముందు చెప్పుకున్నాం. 'కుండలో అన్నం కుండలోనే ఉండాలి. నా పిల్లలు దుండుముక్కల్లా ఉండాలి' అందట ఓ తల్లి. "నేను విభిన్నంగా జీవించను. నోరు తెరచి క్రీస్తును గూర్చి చెప్పను. బైబిల్‌స్టడీ తీసుకోను, బైబిల్‌స్టడీకి ఎవ్వరినీ తీసుకెళ్ళను. పరిచర్యకు త్యాగపూరితంగా ఇవ్వను, కానీ రాష్ట్రంలోని ప్రతి కళాశాల విద్యార్థికి సువార్త అందాలి. ప్రతి కళాశాల కేంద్రంలో ఓ సాక్షిగుంపు ఏర్పడాలి" అంటే ఎలా?

***'మీరు ఊరక ఉన్నారేమి?'*** అని మనల్ని ప్రశ్నిస్తున్నాడు ప్రభువు (న్యాయా 18:9,10). అందుకే ప్రభువు పనిలో అందరం పాలుపంచుకొందాం. అందులోని ఆనందాన్ని ఆస్వాదిద్దాం! మీరు వేసవి సెలవులకు మీ ఇంటికెళ్తే అక్కడి ఇయుతో కలసి పనిలో పాల్గొనండి. ఇది విద్యార్థుల పరిచర్య. గ్రాడ్యుయేట్స్ మీకు సహాయం చేస్తారు, సహకరిస్తారు. మీరే ప్లాన్ చేసి అమలు చేస్తే అందులోని థ్రిల్ వేరు.

అన్ని కేంద్రాల్ని ఒకేసారి రీచ్‌కావడం కష్టం కదా అని మీరనవచ్చు. అవును. మనకున్న వనరులు అన్ని కేంద్రాల్లో ఒకేసారి పరిచర్య ప్రారంభించడానికి సరిపోకపోవచ్చు. కానీ అక్కడో మంచి విశ్వాస గ్రాడ్యుయేట్ దొరికితే ఆయనతో కలసి పరిచర్య ప్రారంభించి కొనసాగించవచ్చు. అందులో మొదటి ప్రాధాన్యత డిగ్రీ కళాశాల కేంద్రాలకిద్దాం. ఆ సెంటర్స్ రీచ్ అయ్యేదాకా ఎడతెగక ప్రార్థించే బాధ్యత తీసుకొందాం. అది బాధ్యత కాదు. ప్రభువు మనకిచ్చిన భాగ్యం. వీలైతే చదువు ముగించుకొని ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న గ్రాడ్యుయేట్‌ని ఆ సెంటర్‌లో కొన్ని నెలలు ఉంచడం ద్వారా పరిచర్య ప్రారంభించడానికి మార్గం సుగమమవుతుంది. ఓ పిలుపిస్తే అలా ఉండి ఉద్యోగం కోసం సిద్ధపడడానికి కొందరు గ్రాడ్యుయేట్స్ సిద్ధంగా ఉన్నారు.



## గొప్ప అవకాశం

'గొప్ప ద్వారము మనకు తెరువబడి ఉంది' 1 కొరింథీ 16:9. విద్యార్థులెంతో ఆశతో సువార్తను అంగీకరిస్తున్నారు. విశ్వాసంలో ఎదుగుతున్నారు. దానితో పాటే ఎదిరించేవారెంతో మంది ఉన్నారు. వ్యతిరేకత ఉంది. ఎదిరించే వారెంతమంది ఉన్నా ప్రభువు తెరిచిన ద్వారాన్ని మూయలేరు. ఆయన మనకి రాసిచ్చేసిన బీడుభూముల్ని దున్ని సస్యశ్యామలం చేద్దాం. కుంభస్థలాలపై దండయాత్ర చేద్దాం. మన పితరులు మనకందించిన మూలాల్ని గుర్తుచేసుకొంటూ, దేవునిపై ఆధారపడుతూ, దేవుని చిత్తానికి లోబడి, ఆత్మనడిపింపుతో, ప్రభువు అనుగ్రహించే వివేకంతో త్యాగపూరితంగా, అంకితభావంతో, దేవుని విధానంలో పరిచర్యను జరిగిద్దాం. విశ్వాసంతో కూడిన మన పనినీ, ప్రేమతో కూడిన ప్రయాసనూ, నిరీక్షణతోకూడిన ఓర్పును ప్రదర్శిద్దాం. ప్రభువు కోసం అన్ని కేంద్రాలూ, అన్ని కళాశాలలనూ స్వాధీనపరచుకొందాం – ప్రభువుకోసం పదమూడు జిల్లాలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల మన ప్రభువు సహాయంతో ఇది సాధ్యమే అన్నది మన గత అనుభవం. ఇప్పటి వరకూ అందుకోలేక పోయిన ప్రాంతాల్ని అందుకొందాం, ప్రభువుకోసం పొందుకొందాం.

ఈ మధ్య ప్రభువును అంగీకరించిన ఇంటర్మీడియెట్ స్టూడెంట్ నుంచి 70 ఏళ్ళ మోస్ట్ సీనియర్ గ్రాడ్యుయేట్ వరకు అందర్నీ కలుపుకొని, కలిసికట్టుగా అందరం ప్రార్థించి ప్రభువు పనిలో పాలుపొందుదాం. ఒక్క కాలేజ్ సెంటర్‌నీ విడిచిపెట్టొద్దు. దేశంలోని అన్ని కళాశాల కేంద్రాల్నీ ఒకేసారి సువార్తతో సంధించిన రాష్ట్రంగా చరిత్ర సృష్టిద్దాం. చరిత్ర చదవడం కాదు సృష్టించడంలో ఉన్న థ్రిల్‌ని అనుభవిద్దాం. ఇదంతా ప్రభువు రాజ్య విస్తరణకూ, ఆయన మహిమకే సుమా!

ఆయన సన్నిధి, ఆయన సలహా, ఆయన సహాయం, ఫలితంగా ఆయన ఆశించే సఫలత, ఆయనకే సమస్త మహిమ!

**– పి.జాన్ విక్టర్,** కర్నూలు

# ఫలించే సువార్త...

యేసుక్రీస్తు తన ప్రసంగాలలో ఆయా సమయాలలో ఎన్నో విషయాలను ప్రకృతి నుంచి ఉదాహరణలిస్తూ, ఉపమానాలతో, సందర్భ సహితంగా బోధించాడు. ఉదా. విత్తువాడు – విత్తనాలు, ఆకాశ పక్షులు, అడవి పువ్వులు, గొఱ్ఱెలు – కాపరి మొదలగునవి. కాబట్టి పరిచారకుడు వినేవారికి అర్థమయ్యేవిధంగా బోధనా పద్ధతులను వాడటం అవసరం. ఆ విధంగా చేసే ప్రసంగాలు సందర్భసహితంగా ప్రభావితం చేసేవిగా ఉంటాయి.

విత్తువాని ఉపమానంలో యేసుక్రీస్తు సువార్తికుడిని విత్తువానితోను, వాక్యాన్ని విత్తనంతోను పోల్చాడు (మత్తయి 13:4-9). విత్తనాలు విత్తకముందు వ్యవసాయకుడు రాళ్ళను, రప్పలను, ముండ్లతుప్ప లను తీసి ఎరువు వేస్తాడు. అలా నేలను సిద్ధపరచిన తర్వాతనే విత్తనాలు విత్తుతాడు. అలాగే సువార్తికుడు వాక్యమనే విత్తనం విత్తకముందు వాక్యం వినేవారిని సిద్ధపరచాలి.

మనుష్యులను సిద్ధపరచడం రెండు రకాలు – 1) సామాజిక సిద్ధపాటు, 2) మానసిక సిద్ధపాటు. మొదటి పద్ధతిని మిషనరీస్ చాలా బాగా ఉపయోగించారు.



వారు విద్యాసంస్థలను, వైద్యశాలలను, సామాజిక సంస్థలను స్థాపించి సువార్తనందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రైస్తవేతరులు అటువంటి సామాజిక కార్యక్రమాలను అనుమానంతో చూస్తున్నారు కాబట్టి రెండవ పద్ధతి ఎక్కువగా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఇప్పుడు కూడా ఆదిమ జాతుల మధ్య మరియు మురికివాడలలో సామాజిక సిద్ధపాటు అవసరమే.

మానసిక సిద్ధపాటు కొరకు అపొస్తలులకార్యాలలో రెండు పద్ధతులు ఇవ్వబడ్డాయి. 1. పేతురు పద్ధతి (అపొ. 2:14-40), 2. పౌలు పద్ధతి (అపొ.కా 17:22-31).

## 1. పేతురు పరిచర్య పద్ధతి

పేతురు బైబిల్‌ను బాగా ఎరిగిన యూదులకు సువార్త నందిస్తున్నాడు కాబట్టి బైబిల్ వచనాలను విరివిగా వాడాడు. యేసుక్రీస్తును బైబిల్ ప్రవచనాల నెరవేర్పుగా చూపించాడు. ఈ పద్ధతి క్రైస్తవులు ఎక్కువగా ఉండే అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో ఎక్కువగా ఉపయోగపడుతుంది. క్రైస్తవేతర దేశాలలోని క్రైస్తవుల మధ్య పరిచర్యలో కూడా బాగా ఉపయోగపడుతుంది. కానీ క్రైస్తవేతరులకు సువార్తనందించే సమయంలో విరివిగా బైబిల్ వచనాలు వాడడం వల్ల వినేవారికి సందేశం అర్థంకాకపోవచ్చు.

క్రైస్తవేతరులకు సువార్త అందించడానికి పౌలు పద్ధతి అన్వయించుకోవచ్చు. పౌలు బైబిల్ నుంచి ఒక్క వచనం కూడా వాడలేదు. కాని బైబిల్‌లోని సందేశాన్ని సామాన్యమైన కొయినే గ్రీకు భాషలో గ్రీకులకు అర్థమయ్యే విధంగా చెప్పాడు.

## 2. పౌలు పరిచర్య పద్ధతి

పౌలు ఏథెన్సులో ఉన్నప్పుడు అక్కడ ఉన్న విగ్రహారాధనను చూచి అతని ఆత్మ పరితాపము పట్టలేకపోయెను (అపొ.కా. 17:16). అలాంటి నిరాశాజనక పరిస్థితిలో పౌలు ఒక ఆశాజనక

విషయాన్ని గుర్తించాడు. అదేంటంటే, వారికి భక్తిభావం ఉన్నది. అదేవిధంగా క్రైస్తవ పరిచారకులు నిరాశాజనక పరిస్థితులలో, అనుకూల విషయాలను గుర్తించగలగాలి. వారు ఒక రాతి బొమ్మనో చెట్టునో మొక్కుతున్నారంటే వారిలో భక్తిభావం ఉందని అర్థం. ఆ భక్తి భావమే లేకపోతే రాళ్ళను కూడా మ్రొక్కేవారుకాదు. భక్తిభావం మంచిదేకాని వారు నిజమైన సృష్టికర్తను మొక్కడంలేదు. దానికి కారణం ఆ సృష్టికర్తను గూర్చి వారికి ఎవరూ చెప్పలేదు. ఎవరైనా చెప్పినా, వారికి అర్థమయ్యే రీతిలో చెప్పలేదు. కాబట్టి వారు రాళ్ళను మొక్కుతున్నారంటే అది వారి తప్పు కాదు. నిజమైన సృష్టికర్తను ఎరిగి, ఆ విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పని వారిది తప్పు. వారి పూజ వారికున్న మతాసక్తి నుండి ఉద్భవిస్తుంది. ప్రస్తుతం భారతదేశంలో అదే పరిస్థితి నెలకొని ఉన్నది.

అటుపిమ్మట పౌలు అక్కడ ఉన్న గ్రీకులలో కొంతమంది సృష్టికర్తయైన దేవుడున్నాడని, ఆయన్ను వారింకా పూర్తిగా తెలుసుకోలేదన్న అవగాహనకు వచ్చి ఏ దేవతా విగ్రహం లేని బలిపీఠం నిర్మించి దానిపై 'తెలియబడని దేవునికి' అని రాసి ఆరాధించే వారిని అభినందించాడు. ఆ విధంగా పౌలు వారిని ఆలోచనలకు పురికొల్పాడు. సౌవార్తీకరణ ఏకపాత్రాభినయం కాకూడదు. వినేవారు సందేశాన్ని విశ్లేషించి వారంతట వారు తీర్మానానికి వచ్చేటట్లు సహాయపడాలి. అందుకే పౌలు తన ప్రసంగాన్ని తర్కానికి అనుగుణంగా, ఆలోచన రేకెత్తిస్తూ దేవుడు ఈ సృష్టికర్త అయితే సృష్టికంటే గొప్పవాడని, అలాంటి గొప్ప దేవునిని ఒక ప్రతిమకు పరిమితం చేస్తే ఆయన్ను అవమానించినట్టేనని బోధించాడు.

పౌలు బైబిల్లోని వచనాలను ఎత్తిచూపలేదు, అలాగని వారి మత గ్రంథాలనుంచి కూడా వచనాలను ఎత్తి చూపలేదు. ఈ మధ్య కొందరు సువార్తికులు ఇతర మత గ్రంథాల నుంచి కొన్ని వచనాలను ఎత్తి చూపిస్తూ అవి క్రీస్తులో నెరవేరుచున్నాయని చెప్తున్నారు. అలా చేయడం ద్వారా ఆ మత గ్రంథాలు కూడా దేవుని ప్రత్యక్షతలే, లేఖనాలే అని వారు ఒప్పుకొన్నట్లవుతుంది. అంతేకాకుండా, ఏ సందర్భంలో ఆ మాటలు వాడబడ్డాయో చూడకుండా క్రైస్తవ్యానికి అన్వయించడం ద్వారా ఆ గ్రంథాలను వక్రీకరించినట్లవుతుంది.

**క్రైస్తవులకు పుణ్యస్థలమంటూ ఏదీలేదు. ఇద్దరు లేక ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందును (మత్తయి 18:20) అని యేసు ప్రభువు చెప్పాడు. దానర్థం ప్రతి క్రైస్తవ ఇల్లు ఒక పవిత్ర ప్రదేశం, ప్రతి ఆరాధనా స్థలం పవిత్ర ప్రాంతం.**

కానీ పౌలు ఒక తత్వవేత్త నుంచి, ఒక కవీశ్వరుని నుంచి కొన్ని విషయాలను ఎత్తి చెప్పాడు. 'మనమాయనయందు బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము' అనే మాటలు తత్వవేత్త అయిన ఎఫిమెనెడిస్ రాసినవి. ఇంకా 'మనమాయన సంతానము' అనే మాటలు అరాటస్ అనే సుప్రసిద్ధ సిసిలియన్ కవి మాటలు. ఇలా ప్రసిద్ధ కవులను ఉటంకించడంలో పౌలు ఉద్దేశం ప్రేక్షకుల నుండి సరియైన ప్రతిస్పందన కొరకే.

పౌలు గ్రీకు రచయితలను ఉటంకించడానికి ఇంకొక కారణం ఏంటంటే గ్రీకు ప్రజలకు సువార్త గ్రీకు సంస్కృతిలోని భాగమే అని చెప్పడానికి. సువార్తికుడెప్పుడూ తన ప్రేక్షకులను తమ సంస్కృతి నుంచి దూరం చేయకూడదు.

## సువార్తలో సంస్కృతి

క్రైస్తవేతర మతాలన్నీ ఏదో ఒక సంస్కృతిని కలిగి ఉన్నవే. ఉదాహరణకు అమెరికన్లు ఇస్కాన్ (హరేరామ, హరే కృష్ణా) మతాన్ని స్వీకరిస్తే పాశ్చాత్య దుస్తులను వదిలి భారతదేశ పద్ధతిలో దుస్తులను ధరించి, సంస్కృతంలో ప్రార్థన, ఆరాధనలను చేస్తారు. దానర్థం వారు హిందూ మతంలోకి మారటమే కాకుండా భారత సంస్కృతిలోకి మారతారు. అలాగే ఒక వ్యక్తి ఇస్లాం మతం స్వీకరిస్తే అతని పేరును అరబిక్ భాషలోనికి మార్చుకొని అరబిక్‌లో ప్రార్థించటం ఆరంభిస్తాడు అంటే అరబిక్ సంస్కృతిలోకి మారడన్నమాట.

అలాగే ప్రతి క్రైస్తవేతర మతం ఒక దేశం మరియు పుణ్యస్థలంతో ముడిపడి ఉంటుంది. హిందువులకు వారణాసి పుణ్యభూమి (హిందువులకు ముఖ్య కేంద్రం), ముస్లిమ్స్‌కు మక్కా పుణ్యభూమి. క్రైస్తవులకు అలాంటి పుణ్యస్థలమంటూ ఏదీలేదు. ఎక్కడ ఇద్దరు లేక ముగ్గురు నా నామమున కూడియుందురో అక్కడ

నేను వారి మధ్యన ఉందును (మత్తయి 18:20) అని యేసు ప్రభువు చెప్పాడు. దానర్థం ప్రతి క్రైస్తవ ఇల్లు ఒక పవిత్ర ప్రదేశం, ప్రతి ఆరాధనా స్థలం పవిత్ర ప్రాంతం. భారతదేశ క్రైస్తవులకు, వారి దేశం కర్మభూమే కాదు పుణ్యభూమి కూడా. క్రైస్తవ విశ్వాసం జాతికతీతమైనది. "క్రీస్తులో యూదుడని, గ్రీకు దేశస్తుడని లేదు..యేసుక్రీస్తునందు మీరందరు ఏకముగా వున్నారు" (గలతీ 3:28) అని బైబిల్ ఘంటాపథంగా చెబుతుంది.

కాబట్టి భారతదేశ సువార్తికులు సువార్తను భారతదేశ సంస్కృతిలో ప్రకటించాలి. సంస్కృతి "ఒకరు జీవించే నైసర్గిక స్వరూపంపైనా, వారు తినే ఆహారం, త్రాగే నీరు, వారి వేషధారణ, వాతావరణం వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. భారతదేశానికి క్రైస్తవ మిషనరీలు గొప్ప సేవచేశారు. కానీ సువార్తను పాశ్చాత్య సంస్కృతిలో ప్రకటించారు. చర్చిలను, పాశ్చాత్య నమూనాలలో కట్టారు. పాస్టర్లకు పాశ్చాత్య రీతిలో గౌనులను ధరింపచేశారు. ఆరాధనా గీతాల ను పాశ్చాత్య సంగీతంలో పాడారు, భారత భాషలలో పాటలను కూడా పాశ్చాత్య రీతిలోనే పాడారు. దీనిని బట్టి క్రైస్తవ్యము ఒక పాశ్చాత్య మతమని అనేకమంది భారతీయులు భావించడం జరిగింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా పెద్దగా మార్పేమీ లేదు. సువార్తికులు గ్రామాలకు వెళితే, వారితోపాటు గిటార్ (పాశ్చాత్య సంగీత వాయిద్యం) తీసుకెళ్తారు, పాశ్చాత్య బాణీలలో పాటలు పాడతారు, ఒకరు ఇంగ్లీష్‌లో ప్రసంగం చేస్తే వేరొకరు ప్రాంతీయ భాషలోనికి తర్జుమా చేస్తారు. గ్రామస్తులు ఇలాంటి వాటిని చూసి సువార్తికులు విదేశీ మతాన్ని ప్రకటిస్తున్నారని అనుకుంటారు. వీటికి బదులు సువార్తికులు భారతీయ దుస్తుల్ని వేసుకొని, ప్రాంతీయ భాషలో సువార్తనందిస్తే ప్రజల ప్రతిస్పందన ఎంతో మేలు కరంగా ఉంటుంది. సాధు సుందర్ సింగ్ కాషాయ వస్త్రాలేసుకున్నందున హిందువులు ఆయన్ను ఎంతగానో గౌరవించి, చేర్చుకొనేవారు. సహో. భక్‌సింగ్ ప్రార్థనా మందిరాల్లో అనేక భారతీయ సంస్కృతి విలువలను ప్రవేశపెట్టడం ద్వారా సౌవార్తీకరణలో గొప్ప విజయం సాధించారు.

**– డా. మనష్షే**



# హైకూలు

నేను ఎదురుపడ్డ ప్రతిసారీ...
ఊసరవెల్లి సిగ్గుపడుతోంది.

సిలువ వెలుగుతూనే ఉంది...
మీరే అడ్డం.

అన్నలు బాగా ఎదిగారు
క్రీస్తుని కనబడనివ్వడంలేదు

కృపలో తడిసి ముద్దయినా
యెదలో చెమ్మ చేరడం లేదు

ఆమె గుండె పగలగొట్టి..
ఆయన కాళ్ళు కడుగుతోంది...
నేను లెక్కలు గడుతున్నా!

నాకు కుడో ఎడమో కావాలి...
మధ్యలో క్రీస్తు మాత్రం లేదు

అలంకరించిన సమాధులం...
అర్థంకాని పాత్రలం...

ఆయన్ను ప్రతిష్టించాలి...
ఇక అహాన్ని దించండి

కుమ్మరి మలుస్తూనే ఉన్నాడు
మట్టికే పెళుసుదనం...

చేప, కాకి, గాడిద, సింహాలు వగైరా
నేను తప్ప... అన్నీ

గోడలు కూలుతున్నా ... గుమ్మాలు కాలుతున్నా
గుండె గదంతా చిక్కని చీకటి...

సంఘం... లోకం...
అవిభక్త కవలలు

లోకానికి వెలుగులు...
మిణుగురులై కనబడ్డం మానేశాయి

అదేంటో విడ్డూరం!
దూలాలు వదిలి... నలుసుకై వేట

ఎమ్మాయి దారిలో నడిస్తేగా!
గుండెలు మండడానికి...

గొర్రెల్ని మేపేవాళ్లు పోయారు...
మేసేవాళ్లు వచ్చారు!

**– డి. అనిల్ కుమార్,** వైజాగ్



కథానిక

# వ్యక్తిగతంగా ఆత్మల్ని గెలుచుకోవడం

తరతరాలుగా క్రైస్తవులు సంఘాన్నీ, తమ పాఠశాలల తరగతి గదుల్నీ, తమ చర్చ్ బెంచీలనూ సువార్తీకరించారే గానీ, అవిశ్వాసులున్న ప్రపంచానికి సువార్త చెప్పలేదు. ప్రజల్ని తమ సంస్థల్లో, సంఘాల్లో తరగతుల్లో నమోదు చేసుకొని, చర్చ్ భవనాలకు ఆహ్వానించారు. అలా చేయడం ద్వారా వారు క్రీస్తును తమ రక్షకునిగా, ప్రభువుగా అంగీకరిస్తారని భావించారు.

చర్చ్‌కి వెళ్ళేవారి విషయంలో ఇది పనిచేసింది. కానీ 90% లేదా అంతకంటే ఎక్కువమంది ఎప్పుడూ సంఘానికి హాజరవ్వరు. కనుక వారినెప్పటికీ సంఘాల్లో గెలుచుకోలేము.

సంఘానికి వెలుపలే మనకు మహా గొప్ప అవకాశం. క్రైస్తవులు ఉద్యోగ స్థలాల్లో, పార్కుల్లో, వీధుల్లో, ఇళ్ళల్లో ఆత్మల్ని గెలుచుకోవాలి. కనుక మనం లోకంలోనికి ప్రజలు ఉండే చోటికి వెళ్ళాలి. వ్యక్తిగత సువార్తీకరణ యొక్క ప్రకాశమానమైన కాంతి నుంచే సంఘం జనించింది. ఇంటింటికి వెళ్ళి చేసిన ముఖాముఖి పరిచర్య ద్వారా నాడు ఆత్మల్ని గెలుచుకొన్నారు.

"... ఆ కాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున అపోస్తలులు తప్ప అందరు యూదయ, సమరయ దేశములందు చెదరిపోయిరి. కాబట్టి చెదరిపోయిన వారు సువార్త వాక్యమును ప్రకటించుచూ సంచారము చేసిరి" (అ.కా. 8:1,4).

ప్రతిచోటా వాక్యాన్ని ప్రకటిస్తూ, ప్రజల్ని క్రీస్తు దగ్గరకు నడిపించారు. కాబట్టి వారి వలె ప్రతి సభ్యుడూ ఇతరుల్ని క్రీస్తు దగ్గరకు ఎలా తీసుకొని రావాలో నేర్చుకోవాలి.

క్రైస్తవుని జీవిత విధానం చాలా సులువైనది. ఒక్కటే మార్గం! ఒక్కటే కార్యం! ఆ ఒక్క మార్గం – యేసు! ఒక్కటే కార్యం – అది ఆత్మల్ని సంపాదించడం! ప్రజలు ఎక్కడుంటారో అక్కడికి వెళ్ళడం. ఆత్మల్ని ప్రతి చోటా సంపాదించడం, ప్రతి వారికి శుభవార్తను అందించడంకంటే సంతోషం మరొకటి లేదు.

"నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" (లూకా 19:10). "... జ్ఞానము గలవారు ఇతరులను రక్షించుదురు" ఆత్మల్ని సంపాదించేవాడు జ్ఞాని (సామెతలు 11:30). నశించే ఆత్మల్ని రక్షించే పనిలో యేసుతోపాటు భాగస్వామి కావడం ప్రపంచంలోకల్లా అత్యున్నతమైన విషయం.

అకులను ఒకసారి కలుసుకుందాం. ఎఫెసీ పట్టణ సందర్శనానికి నాతో రండి. మనం అకుల, ప్రిస్కిల్ల అనే ఇద్దరిని దర్శిద్దాం. వీరు వ్యాపారస్తులు, సంఘ నాయకులు.

"నమస్కారం అకులా! ఇక్కడి సంఘంలో మీరు సభ్యులని తెలుసుకొన్నాం. మేం లోపలికి వచ్చి కొంతసేపు మాట్లాడవచ్చా?"

"తప్పకుండా! లోపలికి రండి"

"ఏమి అనుకోకపోతే, చిన్న ఆసియాలోని సంఘాల్లో ఆత్మల్ని గెలుచుకొనే కార్యక్రమాలు, నిర్వహించే పద్ధతుల గురించి మీరు మాకు వివరించాలని మా ఆశ. కొరింథిలోను, రోమ్‌లోను, అలాగే ఈ ఎఫెసీ సంఘంలోనూ మీరు సభ్యులుగా ఉన్నారని చదివాం. కొత్త నిబంధన సంఘంలోని సువార్త సేవ గురించి చెప్పడానికి మీరెంతైనా అర్హులు. మీరేమనుకోకపోతే మీ సంఘాన్ని సందర్శించాలనుకొంటున్నాం.

"కూర్చోండి, మీరు సమావేశ స్థలంలోనే ఉన్నారు. ఇక్కడే నా ఇంట్లోనే సంఘం సమావేశమవుతుంది".

"మీకు సంఘ ఆలయం ఏమీ లేదా?"

"ఆలయమా? అదేంటి! మాకు అలాంటిదేమి లేదు".

"అకులా, ఎఫెసులో సువార్త ప్రకటించడం కోసం మీ సంఘం ఏమి చేస్తున్నది? సువార్తతో పట్టణాన్ని గెలుచుకోవడం కోసం మీరేమి చేస్తున్నారు?"

"ఓహ్! అదా, మేమెప్పుడో ఎఫెసులో సువార్త ప్రకటించేశాం. పట్టణంలోని ప్రతి వ్యక్తి సువార్తను స్పష్టంగా అర్థం చేసుకొన్నాడు".

"ఏంటి?"

"ఇది వింతగా ఉందా?"

"సంఘం దీన్నెలా చేయగలిగింది? మీకు రేడియో, టెలివిజన్, ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలు (కమ్యూనికేషన్స్), లేక ప్రింటింగ్ ప్రెస్సులూ లేవే. విస్తారంగా సువార్త సభల్ని ఏవైనా నిర్వహించారా?"

"లేదు, బహుశా మీరు వినే ఉంటారు? ఈ ప్రాంతంలో బహిరంగ కూటాలు పెట్టాలని ప్రయత్నించిన ప్రతిసారీ మేము జైలు పాలయ్యే వాళ్ళం".

"మరయితే దీన్నెలా చేయగలిగారు?"

"మేము కేవలం పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్ళేవాళ్ళం. యెరూషలేములోని సంఘం మొదట ఆ పట్టణాన్ని సువార్తీకరించిన పద్ధతి ఇదే. అక్కడ ఉన్న శిష్యులు యెరూషలేము పట్టణమంతటిని చాలా తక్కువ కాలంలోనే సువార్తీకరించారు. చిన్న ఆసియాలోని ఇతర సంఘాలన్నీ వారి మాదిరినే అనుసరించాయి.

"అది ప్రతిచోట ఫలితాలు సాధించిందా?"

"అవును. సాధించింది. అక్కడ ఎంతోమంది మారారు. కొందరు అన్యమత నాయకులు తమ మతాలు నాశనమై పోతాయని భయపడ్డారు. చివరి సారిగా పౌలు ఎఫెసును విడిచిపెట్టినప్పుడు, ఇదే పద్ధతిని కొనసాగించమని మాకు మరీ మరీ గుర్తు చేశాడు.

"అకులా, ఇది ఆశ్చర్యంగా ఉంది! ఈ ప్రకారంగా అయితే, ఎంతమంది సువార్త విని దానికి ప్రతిస్పందిస్తున్నారో ఎలా తెలిసేది?"

"అయ్యో, మీరు వినలేదా? గ్రీకులకూ, యూదులకూ, చిన్న ఆసియాలోని ప్రతి వ్యక్తికి మేం ఎప్పుడో సువార్త వినిపించాం" (అ.కా 19:10).

"అది ఎలా సాధ్యం?"

"కానీ, దమస్కు, ఎఫెసు, ఇలా డజన్ల కొద్ది పెద్ద పెద్ద నగరాలు, అలాగే పట్టణాలూ, గ్రామాలూ అందులో ఉన్నాయిగా, ఎడారుల్లోని సంచార తెగల వారి సంగతేంటి? ఈ ప్రజలందరినీ చేరుకోవడానికి సంఘాలకు ఎంత కాలం పట్టింది?"

"ఎంతో పట్టలేదు; ఖచ్చితంగా చెప్పాలంటే 24 నెలలు (అ.కా 19:10). ఉత్తర ఆఫ్రికాలోనూ, దక్షిణ యూరప్‌లోనూ ఇదే సంభవిస్తున్నది. సువార్త స్పెయిన్‌ను కూడా చేరుకుంది. బ్రిటన్ అనే దేశం గురించి విన్నాం. ఈ పాటికే అక్కడ అనేకమంది క్రైస్తవులై ఉంటారు".

"అకులా, మీరు చెబుతున్నది నమ్మశక్యంగా లేదు. మేము వెయ్యి సంవత్సరాల్లో చేసిన దానికంటే ఎక్కువగా మీరు ఒక్క తరంలోనే చేశారు!"

"వింతగా ఉందే! మేము దీన్నంతటిని చాలా సులభంగా పూర్తి చేశాం. ఈ విషయంలో మీరెంత నిదానంగా ఉన్నారో నాకు అర్థం కావడం లేదు. సంఘ భవనాల్లో ప్రకటించడం కంటే, శుభవార్తను వ్యాపింపజేయడానికి మరింత మంచి పద్ధతి ఉందనుకొంటాను. అదే మీరు కూడా మా పద్ధతులను ప్రయత్నించాలేమో".

**(సంగ్రహణ: కాపరి దుడ్డు కర్ర నుంచి)**

## కోశాధికారి లేఖ

# నిత్యం నిలిచే పెట్టుబడి

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు నామములో శుభాకాంక్షలు.

*"దేవుడు నిన్ను ఆర్థికంగా దీవిస్తున్నప్పుడు, జీవించే స్థాయిని పెంచడం కాదు కానీ ఇచ్చే స్థాయిని పెంచాలి"*

*- మార్క్ బెటర్సన్.*

ఏ విశ్వాసినైనా లేక ఏ ఇజియఫ్‌నైనా దేవుడు ఆర్థికంగా దీవిస్తున్నప్పుడు ఆ విశ్వాసి లేక ఆ ఇజియఫ్ వారు జీవించే స్థాయిని పెంచడం కాదు గానీ ఇచ్చేస్థాయిని పెంచాలి. ఇజియఫ్ సమూహంగా జీవించే స్థాయిని పెంచడం అంటే దుబారాగా ఖర్చు చేసే స్థాయిని పెంచడం కాదుగానీ, పొదుపుగా లోకల్ పరిచర్య అవసరాల కోసం ఖర్చుచేస్తూ, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అవసరాలకోసం, పరిచర్య లేని, పరిచర్య ఆరంభంలో ఉన్న ప్రదేశాలకోసం, విద్యార్థుల మధ్య దేవుని రాజ్య విస్తరణ కొరకు ప్రార్థించేవారముగా, పని కొరకు ఎక్కువగా ఇచ్చేవారంగా ఉండాలి. మన కొరకు ఖర్చుచేసేది ఈలోకంలోనే ఖర్చు అయిపోతుంది గానీ దేవుని పనికోసం ఖర్చు చేసేది నిత్యత్వం వరకు నిలుస్తుంది. అందుకే జాన్ వెస్లీ భక్తుడు "క్రైస్తవ విధానంలో ఇచ్చే ప్రతి బహుమానం పరలోకపు బ్యాంక్‌లో పెట్టే తెలివైన పెట్టుబడి" అని అంటాడు. అయితే మనం చేసే ఖర్చుల విషయాన్ని గమనించినప్పుడు సౌవార్తీకరణ, సౌవార్తీకరణ క్యాంపుల కోసం, క్రొత్తగా వచ్చినవారికి సదుపాయాలు కల్పించే క్రమంలో ఎక్కడలేని పిసినారితనాన్ని చూపిస్తాం. కానీ త్యాగాన్ని నేర్పించాల్సిన క్యాంపులైన శిష్యత్వ, నాయకత్వ శిబిరాలలో దుబారాగా ఖర్చు చేస్తాం. సహవాసపు మీటింగ్స్‌లో ఖరీదైన భోజనమే లక్ష్యం కాక నీరసం రాకుండా కనీస సహవాస భోజనం మన లక్ష్యంగా ఉండాలి. ఒక సీనియర్ గ్రాడ్యుయేట్ ఇలా అన్నాడు "కొన్ని ఇయులలో ధనం కేకు, కోకు కోసం ఖర్చయిపోతుంది". కావున దేవుడు ఆశీర్వదించే కొలది మన జీవన స్థాయిని పెంచక దేవునికోసం ఇచ్చే స్థాయిని పెంచాలని కోరుతున్నాను.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**

## FEBRUARY - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 752.00 | Field Staff Salaries | 5,04,703.00 |
| General Fund | 14,92,044.00 | Field Staff HRA, CA, MA & TA | 3,49,950.00 |
| Staff Support | 33,000.00 | Office Staff Salaries | 2,07,387.00 |
| Raj & JK | 45,000.00 | UESI | 4,00,000.00 |
| Others | 15,000.00 | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 21,753.00 |
| | | Closing Balance | 503.00 |
| **Total** | **15,85,796.00** | | **15,85,796.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-03-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# పనిచేస్తావా, పాడుబడిపోతావా ?



జీవం సమృద్ధిగా పొందామంటారు
అబద్ధం ! వీళ్ళంతా ఆక్సిజన్ మీదే
బ్రతుకుతుంటారు !

మెట్లమీద కూర్చొని చాలా మంది
అడుక్కుంటూ ఉంటారు
ఇవ్వడానికి ఏమీ లేని వీళ్ళు ఇబ్బందిగా
నుంచొని ఉంటారు
ఏమీ పాలుపోక కాబోలు
వెకిలిగా నవ్వుతూ ఉంటారు !!

సెమినార్ల సెలైన్లు ఎన్ని ఎక్కినా
రిట్రీట్‌ల టానిక్‌లు ఎన్ని తాగినా
మూవ్‌మెంట్ లేని మనవాళ్ళు
మాన్యుమెంట్‌లా మిగిలిపోతారు !
మనకెందుకులే అనుకునే వాళ్ళంతా
మనుగడే లేకుండా మరుగై పోతారు !!

ఇది మన ఇంటి పని
దేవుని తోటపని
ఇన్‌వాల్వ్ కాని వారందరికీ
విడమర్చి చెప్పండి
ప్రభుని ఆత్మ కలిగినవారెవరూ
పనిలేకుండా కూర్చోరని !
ఈ లోకంలో పని చెయ్యనివారు
పరలోకంలో కూడా పనికిరారని !!

తాము చెయ్యకుండా
చేసేవాళ్ళను చేయనివ్వకుండా
తేరగా పైకెళ్ళి
ఊరేగుదామని అనుకునే వాళ్ళందరికీ
తెగేసి చెప్పండి
సిలువ మొయ్యనివాడు శిష్యుడు కాదని
పనిచెయ్యనివాడు పాత్రుడు కాదని !

చెదరగొట్టక పోతేనేం
సమకూర్చడం లేదుగా
రెండూ ఒకటే
సారం లేని ఉప్పు
ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే !

– తాళ్ళూరి ప్రసాద్